నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 4-10-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:27 సంచిక:53 పేజీలు: 4 వెల: రూ.1/-

మరో 21 అంబులెన్సులకు కెటిఆర్ జెండా

ఎమ్మెల్యేలు అందించిన మరో 21 అంబులెన్సులను ప్రగతి భవన్ వద్ద ప్రారంభించిన మంత్రి కెటిఆర్.

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం కింద అందిన మరో 21 అంబులెన్సులను తెలంగాణ ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ జెండా ప్రారంభించారు.

ప్రభుత్వానికి విరాళ ంగా పలువురు ప్రజాప్రతినిధులు వీటిని అంజేశారు.

ఈ అంబులెన్స్‌లను ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ జెండా ఊపి ప్రార ంభించారు. మంత్రులు ఈటల రాజేందర్, మల్లారెడ్డి మూడు అంబులెన్స్‌ల చొప్పున ఎంపీలు శ్రీనివాస్ రెడ్డి, రంజిత్ రెడ్డి మూడు అంబులెన్స్‌ల చొప్పున, మంత్రి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి, నన్నపనేని నరేందర్, ఆరూరీ రమేశ్, ఉ పేందర్ రెడ్డి, వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, వరంగల్‌కు చెందిన లక్ష్మణ్ రావు ఒక్కొ అంబులెన్స్ చొప్పున అందజేశారు.

మహబూబ్ నగర్, హైదరాబాద్ కరీంనగర్, రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో సేవలు అందించేందుకు ఈ అంబులెన్సులను వినియోగించనున్నారు.

తెలంగాణలో కొత్తగా మరో 1,718 పాజిటివ్ కేసులు

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా మహమ్మారి విజృంభిస్తూనే ఉంది. గడిచిన 24 గంటల్లో కొత్తగా 1,718 పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.

ఇందులో కేవలం హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే 285 నమోదయ్యాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో 1,97,327 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కాగా, వైరస్ ప్రభావంతో ఇవాళ 8 మంది మృతి చెందగా మొత్తం మరణించిన వారి సంఖ్య 1,153కు చేరింది. గడిచిన 24 గంటల్లో 2,002 మంది చికిత్సకు కోలుకొని ఇండ్లకు వెళ్లగా మొత్తం 1,67,846 మంది డిశ్చార్జి అయ్యారు. మరో 28,328 మంది దవాఖానల్లో చికిత్స పొందుతుండగా.. హోం ఐసోలేషన్‌లో 23,224 మంది ఉన్నారు. రాష్ట్రంలో కరోనా మరణాల రేటు 0.58 శాతంగా ఉండగా రికవరీ రేటు 85.05గా ఉంది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో 49,084 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా మొత్తం 31,53,626 టెస్టులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

హత్రాస్ ఘటనపై కాంగ్రెస్ రాజకీయాలు

బాధిత కుటుంబానికి అండగా ఉండాలన్న ఆలోచన లేదు
కేవలం రాజకీయ పబ్బం కోసం రాహుల్,ప్రియాంకల యత్నం
రాజస్థాన్ ఘటనలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు
మండిపడ్డ కేంద్రమంత్రి స్మృతి ఇరానీ

లక్నో,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో జరిగిన దారుణ ఘటనను ఆధారం చేసుకుని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో ఇలాంటి ఘటనలే జరిగితే ఎందుకు చర్యలు తీసుకోలేదని, అక్కడి సిఎంను ఎందుకు తొలగించలేదని నిలదీశారు. కావాలనే కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని మంత్రి మండిపడ్డారు. హత్రాస్ ఘటనపై కాంగ్రెస్ తదితర పార్టీల రాజకీయ విమర్శలకు ఆమె ఘాటుగా సమాధానం ఇచ్చారు. దీంతో రాజకీయ పార్టీల మధ్య రాజకీయ దుమారం రేపుతున్నది. యూపీలో అధికార బీజేపీపై కాంగ్రెస్ సహా పలు పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. రాహుల్ గాంధీ రాజకీయ లబ్ది కోసమే హత్రాస్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్నారని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా కుట్రలు చేయడంలో ఆరితేరిందని, కాంగ్రెస్ కుతంత్రాలు దేశ ప్రజలకు తెలుసని స్మృతి ఇరానీ వ్యాఖ్యానించారు. అందుకే 2019 ఎన్నికల్లో జనం బీజేపీని గెలిపించారని చెప్పారు. ఈ రోజు రాహుల్‌గాంధీ రాజకీయ లబ్ది కోసమే హత్రాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్నారు తప్ప, బాధితురాలికి న్యాయం చేయడం కోసం కాదని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. హత్రాస్ ఘటన బాధిత కుటుంబానికి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ స్పష్టం చేశారు. రాహుల్, ప్రియాంక హత్రాస్ పర్యటనపై ఆమె మండిపడ్డారు. రాజస్తాన్ అత్యాచారాల విషయాన్ని ప్రస్తావిస్తూ ఆమె ఎదురుదాడికి దిగారు. రాజస్తాన్ ఘటనలపై సీఎం అశోక్ గహ్లోత్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. హత్రాస్ ఘటన విషయంలో రాహుల్, ప్రియాంక ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్రిక్తతలు రెచ్చగొట్టి లాభం పొందేందుకే వారిద్దరూ మళ్లీ హత్రాస్ పర్యటన పెట్టుకున్నారని ఆరోపించారు. కాగా, హత్రాస్‌కు బయల్దేరిన రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు గురువారం అడ్డుకున్న సంగతి తెలిసిందే. లాఠీచార్జిలో రాహుల్ కిందపడటంతో దేశవ్యాప్తంగా యోగి ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తమైంది. శుక్రవారం కూడా అలాంటి ఘటనే జరిగింది. తృణమూల్ నేతలపైనా హత్రాస్ సరిహద్దుల్లో లాఠీచార్జ్ జరిగింది. హత్రాస్ బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

ఇదిలావుంటే దేశ రైతుల కోసం వ్యవసాయ చట్టాలను తెచ్చిన కేంద్రాన్ని అభినందించాల్సిన పార్టీలు రైతులనుమోసం చేసేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతులు తమ పంటలను ఎక్కడూనా, ఎప్పుడైనా, ఏ దరకైనా అమ్ముకునే వెసలుబాటు తీసుకుని వస్తే ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. రైతులు బాగుపడడం ఇష్టం లేదా అని అన్నారు. ఇదిలావుంటే కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి హత్రాస్ ఘటన నిరసనల సెగ తగిలింది. వారణాసి వచ్చిన ఇరానీని కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆమె కారును చుట్టుమట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బాధితురాలికి న్యాయం చేయాలని, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హత్రాస్ పర్యటనకు అనుమతినివ్వాలని వారు డిమాండ్ చేశారు. దీంతో ఆందోళన కారులను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, రాహుల్, ప్రియాంక మరోసారి హత్రాస్ పర్యటనకు బయల్దేరారు. ఈ నేపథ్యంలో యూపీ డీజీపీ, ఉన్నతాధికారులు సైతం హత్రాస్ బయల్దేరి వెళ్లారు. హత్రాస్ ప్రాంతంలో భారీగా పోలీసులను మోహరించారు.

చరిత్రలో నేటినిజం

మయన్మార్ పర్యటనకు ఆర్మీచీఫ్

న్యూఢిల్లీ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఆర్మీ చీఫ్ ఎంఎం నరవనే, విదేశాంగ కార్యదర్శి హర్ష్ శ్రింగ్లా వచ్చేవారం మయన్మార్‌ను సందర్శించనున్నారు. భారతదేశం పొరుగు దేశాల్లో చైనా తన ప్రభావాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో ఈ పర్యటన చోటుచేసుకుంది. కోవిడ్-19 సంక్షోభం, భారత్-చైనాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్మీ చీఫ్ ఓ విదేశీ పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. కాగా విదేశాంగ కార్యదర్శికి ఇది రెండవ పర్యటన. హర్ష్ శ్రింగ్లా ఇప్పటికే బంగ్లాదేశ్‌ను సందర్శించారు. ఆర్మీ చీఫ్ నరవనే గతంలో మయన్మార్‌కు భారత్ డిఫెన్స్ అటాచ్‌గా పనిచేశారు. సమావేశం సందర్భంగా కోవిడ్ సంక్షోభం, వ్యాక్సిన్, రోహింగ్యాలు స్వదేశానికి తిరిగి రావడం వంటి ఇతర అంశాలు సమావేశంలో చర్చకు రానున్నాయి.

యూపిలో మరో అత్యాచార ఘటన

మైనర్ బాలికను ఎత్తుకెళ్లి రేప్ చేసిన దుండగుడు

లక్నో,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లో మరో అత్యాచార దారుణం వెలుగు చూసింది. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా, ప్రజలు ఎంత ఆందోళనకు దిగినా మహిళలపై దారుణాల పరంపర మాత్రం కొనసాగుతూనే ఉన్నది. ఓ వైపు హత్రాస్ దారుణం దేశవ్యాప్తంగా దుమారం రేపుతుంటే తాజాగా బల్లియా జిల్లాలో మరో దారుణం జరిగింది. ఆసిఫ్ అనే 23 ఏండ్ల బాలుడు 15 ఏండ్ల బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. బల్లియా జిల్లాలోని సికందర్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో తాజాగా ఈ ఘటన వెలుగు చూసింది. సికందర్‌పూర్ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. నిందితుడు ఆసిఫ్ బుధవారం సాయంత్రం బాలికను అపహరించి ఓ రహస్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను బెదిరించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే ఈ ఘటనపై బాధితురాలి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం బాలికను బంధించిన ప్రదేశాన్ని గుర్తించి ఆమెను విడిపించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

బాలికను వైద్య పరీక్షల కోసం జిల్లా ఆస్పత్రికి తరలించామని సికందర్‌పూర్ పోలీసులు శనివారం మీడియాకు వెల్లడించారు. నిందితుడిపై నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హత్రాస్ ఘటనపై యోగి దిద్దుబాటు చర్యలు

జిల్లా ఎస్పీ సహా ఐదుగురిపై వేటు

లక్నో,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): హత్రాస్ సంఘటనను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని చర్యలు మొదలు పెట్టారు. జిల్లా ఎస్పీ, సీఐతోపాటు మరో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. బాలికను హత్య చేసిన సంఘటనలో నిర్లక్ష్యంగా దర్యాప్తు చేసినందుకు ఎస్పీ హత్రాస్ విక్రాంత్ వీర్, అప్పటి సీఐ రామ్ షాబాద్ సహా ఐదుగురు పోలీసులను సస్పెండ్ చేశారు. సిట్ మొదటి దర్యాప్తు నివేదికను స్వీకరించిన తరువాత ఐదుగురిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. గురువారం, అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ హత్రాస్ సంఘటనను సుమోటా తీసుకొని పోలీసుల పనితీరును ప్రశ్నించింది. అక్టోబర్ 12 న హోంశాఖ అదనపు చీఫ్ సెక్రటరీ, డీజీసీ, డీఎం, అప్పటి ఎస్పీలు కోర్టు ముందు హాజరుకావాలని సమన్లు జారీచేసింది. విక్రాంత్ వీర్ స్థానంలో వినీత్ జైస్వాల్‌ను హత్రాస్ ఎస్పీగా ప్రభుత్వం నియమించింది. రాయ్‌బరేలిలో పోస్ట్ చేసిన ఏఎస్పీ నిత్యానంద్ రాయ్‌ను షమ్లీ ఎస్పీగా నియమించినట్లు హోం శాఖ అదనపు చీఫ్ సెక్రటరీ అవినాశ్ కుమార్ తెలిపారు. ఎస్పీతో పాటు అప్పటి పోలీస్ స్టేషన్ పోలీసులు కూడా దర్యాప్తు నివేదికలో దోషులుగా తేలింది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్పటి ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ చందప దినేష్ కుమార్ వర్మ, సీనియర్ సబ్ ఇన్‌స్పెక్టర్ జగవీర్ సింగ్, హెడ్ మొహర్రిర్ మహేష్ పాల్‌ను సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేసిన ఐదుగురు పోలీసులు, నిందితులు, ఇతర సంబంధ వ్యక్తులు, ఎస్పీతో సహా పోలీసుల పాలిగ్రాఫ్, నార్కో విశ్లేషణ పరీక్షలను నిర్వహించడానికి సూచనలు కూడా ఇచ్చినట్లు హోం శాఖ తెలిపింది. హత్రాస్ సంఘటన తరువాత, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అనేక ఇతర ప్రదేశాలలో మహిళలపై పెరిగిన నేరాలకు ఆజ్యం పోసిన రాజకీయ వాతావరణం మధ్య నేరస్థులపై కఠినమైన వైఖరి తీసుకుంటానని ట్వీట్ చేశారు.

సిఎం సహాయనిధికి బ్రాడ్‌రిడ్జ్ 50లక్షల విరాళం

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): కొవిడ్-19 నివారణలో భాగంగా సహాయక చర్యల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి బ్రాడ్‌రిడ్జ్ అనే ఐటీ కంపెనీ రూ. 50 లక్షలు విరాళం ప్రకటించింది.

ఈ మేరకు రూ. 50 లక్షల చెక్కును ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్‌కు బ్రాడ్‌రిడ్జ్ కంపెనీ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి కేటీఆర్ అభినందించారు. కరోనా వైరస్ నివారణ చర్యల్లో ముందు వరుసలో ఉండి పని చేస్తున్న హెల్త్ కేర్ వర్కర్స్, పోలీసుల పట్ల పేటీం, లైఫ్ బాయ్ సోప్, యూ వూయ్ కెన్ సంస్థలు మానవత్వాన్ని చాటుకున్నాయి. ఈ మేరకు ఒక లక్ష హైజిన్ ప్రొడక్ట్స్ ను మంత్రి కేటీఆర్‌కు ఆ సంస్థల ప్రతినిధులు అందజేశారు. వారికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

దేశ భద్రత కన్నా మరేది ముఖ్యం కాదు

రక్షణరంగంలో రాజీ పడే ప్రసక్తే లేదు
ఆర్టీ,ప్రజల అవసరాలకు ఉపయోగపడనున్న టన్నెల్
అటల్ టన్నెల్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ

సిమ్లా,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): దేశ భద్రతే తమ ప్రభుత్వానికి ముఖ్యమైన అంశమని, అంతకంటే ముఖ్యమైన అంశం తమకు మరొకటి లేదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. అయితే రక్షణరంగంలో రాజీపడ్డ ఘటనలను కూడా ప్రజలు చూశారని, గత ప్రభుత్వాలపై మోదీ అన్యాపదేశంగా మండిపడ్డారు. సరిహద్దు మౌలిక సదుపాయాల అభివృద్ధికి తాము అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ ఫలాలు కేవలం భద్రతా బలగాలకే అందవని, దేశంలోని సామాన్యులకు కూడా అందుతాయని ప్రకటించారు. ప్రపంచంలోనే అతిపెద్ద పొడవైన 'అటల్ టన్నెల్' ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... ఈ టన్నెల్ పూర్తికావాలన్నది కేవలం అటల్ బిహారీ వాజ్‌పాయ్ కల మాత్రమే కాదని, హిమాచల్‌ప్రదేశ్ ప్రజల కల కూడా అని ఆయన అన్నారు. ఇంత శక్తిమంతమైన, ముఖ్యమైన టన్నెల్ సరిహద్దుకు సంబంధించిన మౌలిక సదుపాయాలను మరింత పటిష్ఠ పరుస్తుందన్నారు. కొత్త బలాన్ని చేకూరుస్తుందని ప్రకటించారు. కొత్త కొత్త సంస్కరణలను తేవడం ద్వారా సరికొత్త, అధునాత ఆయుధాలు దేశంలోనే తయారు చేసుకోడానికి వీలవుతుందని అన్నారు. చాలా కాలం తర్వాత మహాదళపతి బిపిన్ రావత్ కూడా మన వ్యవస్థలో భాగం అయ్యారని, భారత సైన్యానికి అవసరమైన మౌలిక సదుపాయాలను సేకరించే విషయంలోనూ, ఉత్పత్తి చేసే విషయంలోనూ మంచి సమన్వయం ఏర్పడిందని మోదీ ప్రశంసించారు. ఈ టన్నెల్ ప్రారంభం ప్రపంచస్థాయి సరిహద్దు కనెక్టివిటీకి ఓ ఉదాహరణగా నిలుస్తుందని ప్రకటించారు. సరిహద్దు మౌలిక సదుపాయాలను పటిష్ఠపరిచాలన్న డిమాండ్లు చాలా కాలంగానే ఉన్నాయని, అయితే ప్రణాళిక దశలోనే ఆగిపోతున్నాయని, లేదా మధ్యలోనే ఆగిపోయాయని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత బిహార్‌లోని 'కోసీ మహాసేతు' నిర్మాణాన్ని కూడా వేగవంతంగా పూర్తిచేసి.. జాతికి అంకితం చేశామని ఆయన గుర్తు చేశారు. చాలా తక్కువ వనరులున్నా సరే.. దేశ జవాన్లు ఎలా పనిచేస్తున్నారన్న విషయాన్ని ప్రపంచానికి చాటి చెప్పే ప్రయత్నంలో భాగంగా వివిధ యూనివర్శిటీలు ఈ టన్నెల్‌ను ఓ 'కేస్ స్టడీ' గా అధ్యయనం చేయాలని అందుకు విదేశాంగ శాఖ ఓ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. అంతేకాకుండా ఈ టన్నెల్‌ను నిర్మించిన విధానం, చేసిన శ్రమను అధ్యయనం చేయడానికి వీలుగా ఇంజినీరింగ్ విద్యార్థులకు అవకాశం కల్పించాలని కేంద్ర విద్యాశాఖను కూడా మోదీ ఆదేశించారు. టన్నెల్ నిర్మాణం ప్రారంభించిన సమయంలో నిపుణులను అడిగితే... 2040 లో పూర్తవుతుందని నిపుణులు పేర్కొన్నారని, అయితే... కేవలం ఆరు సంవత్సరాల్లోనే దీనిని పూర్తి చేసి చూపించామని ఆయన పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న మిగితా ప్రాజెక్టులను కూడా ఇదే తరహాలో త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వ్యూహాత్మకంగా అత్యంత ప్రముఖమైన 'దౌలత్ బేగ్ ఓల్డీ ఏయిర్ స్ట్రిప్' 45 ఏళ్ల నుంచి మూసే ఉందని, దాని వివరాల్లోకి వెళ్లదలుచుకోలేదని, అయితే దాని వెనకున్న దాగి వున్న ఒత్తిళ్లేందని ప్రశ్నించారు. అనుసంధానించే పక్రియ అభివృద్ధి అన్న పక్రియకు నేరుగా సంబంధం ఉంటుందని, సరిహద్దు ప్రాంతంలో అనుసంధానించే పక్రియ కూడా భద్రతతో ముడిపడి ఉంటుందని మోదీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ బిపిన్ రావత్, ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నారావణెళి, హిమాచల్ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్ మోదీ వెంట ఉన్నారు.

ఆస్ట్రియా టన్నెలింగ్ విధానంలో నిర్మాణం

దాదాపు రూ.3,500 కోట్ల వ్యయంతో ఆస్ట్రియా టన్నెలింగ్ విధానంలో దీన్ని నిర్మించారు. 9.02 కిలోమీటర్ల అతి పొడవున నిర్మించిన ఈ టన్నెల్ సముద్ర మట్టానికి 3,060 మీటర్ల ఎత్తులో గుర్రపు షూ ఆకారంలో ఉంది. ఈ టన్నెల్ ద్వారా మనాలీ నుంచి లద్దాఖ్‌లోని లేహ్ వరకు దాదాపు 5 గంటల ప్రయాణ సమయం తగ్గుతుంది. మనాలీ నుంచి లాహాల్-స్పితి లోయతో అనుసంధానించి నిర్మించిన ఈ సొరంగ మార్గం వల్ల శీతాకాలంతో పాటు అన్ని కాలాల్లో ఏడాది పొడవునా ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలు కల్పించినట్లయ్యింది. రోజుకు 3,000 కార్లు, 1,500 ట్రక్కులు ఈ టన్నెల్ గుండా ప్రయాణించవచ్చు. ప్రతీ వాహనం గరిష్టంగా 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించవచ్చని అధికారులు వెల్లడించారు. కీలకమైన పాక్, చైనా సరిహద్దులో సియాచిన్ గ్లేసియర్, అక్సాయ్ చిన్‌లలో మన సైనికులు నిరంతర పహరా కాస్తున్నారు. వారికి ఆహార పదార్థాలను, ఆయుధాలను, ఇతర సామగ్రిని తీసుకెళ్లడం చాలా కష్టతరంగా ఉండేది. ఈ నేపథ్యంలో రోహతాంగ్ పాస్ కింద సొరంగం నిర్మించాలని అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నిర్ణయించారు. దీనికి అనుగుణంగా జూన్ 3, 2000 న దక్షిణ ముఖ ద్వారానికి శంకుస్థాపన చేశారు. అత్యంత కష్టతరమైన విస్తీర్ణాన్ని కలిగి ఉన్నఈ ప్రదేశంలో భౌగోళిక ,వాతావరణ సవాళ్లను అధిగమించడానికి బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) అవిశ్రాంతంగా పనిచేసింది. వాజ్‌పేయి చేసిన కృషికి గుర్తుగా రోహతాంగ్ టన్నల్‌కు అటల్ టన్నల్ అని పేరు పెట్టాలని కేంద్ర కేబినెట్ 2019 లో నిర్ణయించింది.

కరోనా పీరియడ్ విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలి

-నష్టాల్లో కూరుకుపోయిన థియేటర్లను ఆదుకోవాలి
నిబంధనల మేరకు నడుపుతామన్న థియేటర్లు యాజమాన్యాలు

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): థియేటర్లు తెరచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా.. అనుమతి ఇవ్వాలని థియేటర్ల ఓనర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. తెలంగాణ థియేటర్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం శనివారం నాడిక్కడ జరిగింది. ఈ సందర్భంగా థియేటర్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. థియేటర్ ఇండస్ట్రీ చావు బ్రతుకుల్లో ఉందని.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది. ప్రతీ థియేటర్‌కి రాష్ట్ర ప్రభుత్వం ఇన్సెంటీవ్స్ ఇవ్వాలని కోరింది.

లాక్‌డౌన్ సమయంలో థియేటర్ల విద్యుత్ బిల్లులు మినహాయించాలని విజ్ఞప్తి చేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం.. థియేటర్లలో పార్కింగ్ ఛార్జీలను ఎత్తివేసిందని థియేటర్ల ఓనర్లు తెలిపారు. తమకు కూడా ఏదో రకంగా ఆదుకుంటే తప్ప థియేటర్లను అందుబాటులోకి తీసుకుని వచ్చే పరిస్థితి లేదన్నారు. మొత్తానికి కరోనా లాక్‌డౌన్ వలన దాదాపు ఆరు నెలలుగా మూతపడ్డ థియేటర్స్ త్వరలోనే తెరుచుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇంతకాలం ప్రేక్షకులతో కళకళలాడే థియేటర్స్ బోసిపోయాయి. ఎప్పుడు తెరుస్తారా అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రేక్షకులకు కేంద్ర ప్రభుత్వం తాజాగా గుడ్ న్యూస్ చెప్పింది. అన్‌లాక్ 5 మార్గదర్శకాల్లో ఈ నెల 15 నుండి థియేటర్ల ప్రారంభించొచ్చు. అయితే 50 శాతం ఆక్యుపెన్సీతో మాత్రమే థియేటర్ల నడపాలని, ప్రతి షోకు థియటర్ శానిటైజ్ చేయడం తప్పనిసరి అని మార్గదర్శకాల్లో ప్రభుత్వం థియేటర్ యజమాన్యానికి ఆదేశాలు జారీ చేసింది. సినిమా థియేటర్స్ పునః ప్రారంభంపై తెలంగాణ థియేటర్స్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం అయింది. సుదర్శన్ థియేటర్ లో వీరందరు సమావేశం కాగా, థియేటర్స్ ప్రారంభిస్తే ఎలాంటి చర్చలు తీసుకోవాలి అనే దానిపై చర్చ చేశారు. టిక్కెట్స్, భౌతిక దూరం, శానిటైజేషన్, నిర్వహణ భారం, పార్కింగ్, కరెంట్ బిల్ తదితర విషయాల గురించి చర్చించారు. సినిమా థియేటర్స్‌కు ఎక్కువ కరెంట్ బిల్లులు వస్తున్నాయని ప్రతినిధులు పేర్కొన్నారు . కరోనా సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రేక్షకులు ఎవరు టిక్కెట్స్, నగదు తాకకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సినిమా విరామంలో ప్రేక్షకులు గుమిగూడకుండా ఉండేలా ఏర్పాటు చేయడంతో పాటు, శానిటైజర్స్ కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ నెల 15న థియేటర్స్ తెరిచిన ఒకేసారి ప్రేక్షకులు రారరని థియేటర్ యజమానులకు కొన్నాళ్ళపాటు ఇబ్బందులు తప్పవు. తెలంగాణ ప్రభుత్వం కూడా థియేటర్స్ తెరిచేందుకు అనుమతినిస్తుందని భావిస్తున్నాం అని తెలంగాణ థియేటర్స్ ఓనర్స్ అసోసియేషన్ మీడియా సమావేశంలో తెలిపారు.

నయీం కేసులో మరో సంచలనం

-25 మంది పోలీస్ అధికారులకు సిట్ క్లీన్‌చిట్

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. యావత్ దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో మరో సంచలనం వెలుగుచూసింది. గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులకు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ క్లీన్‌చిట్ ఇచ్చింది. నయీంకు సహకరించినట్లు 25 మంది పోలీసులపై ఆరోపణలున్నాయి. నయీంతో సంబంధాలున్నట్లు 25 మంది పోలీసులు ఆరోపణలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. 25 మంది పోలీస్ అధికారులపై ల్యాండ్ సెటిల్‌మెంట్లు, బెదిరింపుల ఆరోపణలున్నాయి. ఎలాంటి సాక్ష్యాధారాలు లభించని కారణంగా 25 మందికి సిట్ అధికారులు క్లీన్‌చిట్ ఇచ్చారు.అయితే ఈ ఆరోపణలపై ఎలాంటి సాక్ష్యాధారాలు లభించకపోవడంతో క్లీన్‌చిట్ ఇస్తున్నట్లు పేర్కొంది. ఇద్దరు అదనపు ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలతోపాటు 13 మంది సీఐలు, ఓ హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లకు క్లీన్‌చిట్ లభించింది. సుపరిపాలన వేదిక రాసిన లేఖకు శనివారం సిట్ సమాచారం ఇచ్చింది. సుపరిపాలన వేదిక కార్యదర్శి పద్మనాభరెడ్డి ఇటీవల నయీం కేసును సీబీఐకి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. షాద్‌నగర్‌లో 2016, ఆగష్టు 8న గ్యాంగ్ స్టర్ నయీంను పోలీసులు ఎన్‌కౌంటర్‌లో హతమార్చిన సంగతి తెలిసిందే.

నయీం కేసులో 25మంది పోలీస్ అధికారులకు సిట్ క్లీన్‌చిట్ ఇచ్చింది. నయీం కేసులో 175కి పైగా సిట్ చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. ఇందులో 130కి పైగా కేసుల్లో 8 మంది రాజకీయ నాయకుల పేర్లు, ఇద్దరు అడిషనల్ ఎస్పీలతో పాటు ఏడుగురు డీఎస్పీలు, 13 మంది సీఐలతో పాటు హెడ్‌కానిస్టేబుల్ వరకు అందరికీ సిట్ క్లీన్‌చిట్ ఇచ్చేసింది. నయీం కేసులో 25 మంది పోలీస్ అధికారుల పాత్రపై ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ రాసిన లేఖకు సిట్ చీఫ్ నాగిరెడ్డి పై విధంగా సమాధానం ఇచ్చారు.

హత్రాస్ దోషులను ఉరితీయాల్సిందే !

నేటినిజం
ఆదివారం 4-10-2020

ఉత్తరప్రదేశ్‌లో అత్యాచార ఘటనలు దేశం సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్నాయి. గతంలో ఉన్నావ్ ఘటన ఎంతో సంచలనం కలిగించింది. అయితే బరితెగించి..అచ్చోసిన ఆంబోతుల్లా వీధుల్లో పడుతున్న మృగాళ్లను ఎవరు ఆపగలరు. హైదరాబాద్ దిశ ఘటనలో దుర్మార్గులు ముగ్గురినీ ఎన్‌కౌంటర్ చేసినా బుద్ధి రాలేదే. నిర్భయ ఘటనలో దోషులను ఉరితీసినా దేశం మారలేదే. దేశంలో నీతినియమాలు,మానవసంబంధాలు అడుగంటి విచ్చల విడితనం పెరిగిన దరిమిలా మృగాళ్లను కాల్చేయాల్సిందే. వరుస ఘటనల కారణంగా నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా నెలలోపే శిక్షించి క్రూరంగా చంపితే తప్ప మార్పు రాదు. గల్ఫ్ దేశాల్లో లాగా బహిరంగ శిక్షలు అమలు చేయాలి. నేరాలు చేయాలంటేనే భయపడేలా చేయాలి. నిజానికి యూపిలో గత దశాబ్దాలుగా అరాచక పాలన సాగింది. గూండాగిరీలు రాజ్యమేలాయి. యోగి ఆదిత్యనాథ్ పాలనా పగ్గాలు చేపట్టిన తరవాతనే అరాచక శక్తులను అణచివేశారు. రౌడీయిజంపై ఉక్కుపాదం మోపారు. ఎక్కడిక్కడ అసాంఘిక శక్తులను అణచివేశారు. ఇవన్నీ చేస్తుంటే అక్కడ ప్రభుత్వం అణచివేస్తోందని గగ్గోలు పెట్టారు. ఎన్‌కౌంటర్లపై రోడ్డెక్కారు. హత్రాస్ ఘటనలోనూ దోషులను వదిలిపెట్టమని ప్రకటించారు. కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. సిఎం యోగి ప్రకటించినట్లుగా ఇకముందు అత్యాచార ఘటనలకు ఎవరు పాల్పడినా.. భయపడేలా చేయాలి. అందుకు యూపి నుంచే నాంది పలికితే అందుకు దేశమంతా హర్షిస్తుంది. అత్యాచారం ఘటనల్లో మృగాళ్లు వణికిపోయేలా చేయాలి. చట్టాలు, కోర్టులు అంటూ కాలక్షేపం చేస్తూ కూర్చుంటే న్యాయం జరగదు. ప్రజల్లో కూడా భయం ఉండదు. నిర్భయ చట్టం తీసుకుని వచ్చినా.. మృగాళ్లల్లో కించిత్తు కూడా భయం కలగడం లేదు. అయితే యూపిలో జరుగుతున్న ఘటనల విషయంలో విపక్షాలు ఒక్కో సందర్భంలో ఒక్కో విధంగా వ్యవహరిస్తున్నాయి. వారికి రాజకీయం తప్ప ప్రజలు అక్కర్లేదు.

అయితే హత్రాస్ ఘటన అత్యంత హేయమైనది. ఓ దళిత బాలికను రేప్ చేసి చావుకు కారణమైన దుండుగులు ఎవరైనా..ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాల్సిందే. కానీ ప్రభుత్వం కూడా ఈ విషయంలో క్రూరంగా వ్యవహరించింది.

హత్రాస్ జిల్లాలో దుండగుల అమానుష త్వానికి బలైన పందొమ్మిదేళ్ల దళిత యువతిని ఘోరంగా అవమానించారు. పద్ధతి ప్రకారం దహనసంస్కారాలు కూడా చేయకుండా దళి కుటుంబాన్ని అడ్డుకున్నారు. ఇందుకు సాక్షాత్తూ పోలీసులే కారణం కావడం దారుణం కాక మరోటి కాదు. చనిపోయిన కూతరు అంత్యక్రియలు నిర్వహించుకునే హక్కును ఆ తల్లిదండ్రల నుంచి లాక్కోవడం అమానుషం కాక మరోటి కాదు. శాంతిభద్రతల పరిస్థితి తలెత్తకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పోలీసులు చెబుతున్న కారణం నమ్మశక్యంగా లేదు. అలాంటి సమస్య తలెత్తు తుందనుకుంటే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సిన బాధ్యత పోలీసులదు. అంతేతప్ప ఆ మాటున పౌరుల విశ్వాసాలను కాలరాసే హక్కు వారికి లేదు. హత్రాస్‌లో అమానుషంగా వ్యవహరించిన పోలీసులకు, జిల్లా ఉన్నతాధికారులకు పట్టింపులు ఉండకపోవచ్చు. కానీ ఏ మతస్తులకైనా చావుపుట్టుకల సమయాల్లో పాటించాల్సిన విధివిధానాలపై విశ్వాసాలుంటాయి. అవి తప్పితే పడే బాధ వర్ణనాతీతంగా ఉంటుంది. అత్యాచర ఘటన తరవాత ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో పది రోజులపాటు మృత్యువుతో పోరాడి మంగళవారం ఉదయం కన్నుమూసిన ఆ యువతి భౌతిక కాయాన్ని కుటుంబసభ్యుల ప్రమేయం లేకుండా పోలీసులే అర్ధరాత్రి ఆమె గ్రామానికి తరలించుకు పోవడం, కుటుంబ సభ్యులెవరూ లేకుండా వారే అంత్యక్రియలు పూర్తి చేయడం నిరంకుశ విధానాం తప్ప మరోటి కాదు. అత్యాచార ఘటనకు బాధ్యులైన వారిని వదిలేసి..బాధితురాలి పట్ల ఇంత క్రూరంగా వ్యవహరించాల్సిన అవసరం లేదు. వాహనానికి అడ్డొచ్చిన యువతి తల్లిదండ్రుల్నీ, ఆమె అన్నాచెల్లెళ్లనూ పక్కకు నెట్టి, ఆ తర్వాత వారిని వారింట్లోనే బంధించి ఈ తతంగమంతా పూర్తిచేయడం దేశం మొత్తం సిగ్గుతో తలదించుకునే విషయం. ఆమె భౌతికకాయాన్ని అప్పగిస్తే ఇంటికి తీసుకెళ్తామని ఆ యువతి తల్లిదండ్రులు పోలీసుల కాళ్లావేళ్లాపడినా ఇవ్వక పోవడం రాక్షసకాండ కాక మరోటి కాదు. దీనికి సిఎం యోగి ఆదిత్యానాథ్‌దే పూర్తి బాధ్యత. పోలీసులు ఇలా ఎందుకు వ్యవహరించారో విచారించాలి. యువతి మృతదేహాన్ని పోలీసులు ఎందుకు స్వాధీనం చేసుకున్నారన్నది తెలియాలి. తెల్లారుజామున 4 గంటలకు ఆమె మరణించిందని తెలిసి, స్వగ్రామానికి తీసుకెళ్లడానికి కుటుంబం ఏర్పాట్లు చేసుకుని 6 గంటల సమయంలో అడిగేసరికే పోలీసులకు అప్పగించామని ఆసుపత్రి అధికారులు చెప్పడం కూడా అనుమానాలకు తావిస్తోంది. అలా తీసుకెళ్లిన తరవాత అర్ధరాత్రి వరకూ ఆ యువతి భౌతికకాయం ఎక్కడుంచారో తెలియదు. కనీసం స్వాధీనం చేసుకున్న వెంటనే ఆమె స్వస్థలానికి తరలించినా మధ్యాహ్నానికి అంత్యక్రియలు పూర్తయ్యేవి. ఈ మొత్తం వ్యవహారాన్ని అలహాబాద్ హైకోర్టు సుమోటాగా తీసుకుని ఉన్నతాధికారులను తన ఎదుట హాజరుకావాలని ఆదేశించడం మంచి పరిణామం. అదలావుంటే ఇప్పుడు ఆదరాబాదరాగాకి అంత్యక్రియలు కూడా జరిపాక ఆమెపై అసలు అత్యాచారం జరగలేదని, తీవ్ర గాయాలు కూడా లేవని పోలీసులు మాట్లాడుతున్న తీరు మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఫోరెన్సిక్ నివేదికను అందుకు సాక్ష్యంగా చూపుతున్నారు. యువతి చావుబతుకుల్లో వుండగా ఇచ్చిన వాంగ్మూలంలో తనపై నలుగురు యువకులు అత్యాచారం చేశారని చెప్పింది. పైగా యువతి మర్మావయవంపై తీవ్ర గాయాలున్నాయని తొలుత పరీక్షించిన లేడీ డాక్టర్ నిర్ధారించారు. అంటే దుండగులపై అత్యాచారం కేసు పెట్టడానికి లేడీ డాక్టర్ ఇచ్చిన నివేదికే సరిపోతుంది. ఇప్పుడు జరుగుతున్నది గమ నిస్తే యువతికి న్యాయం చేయడం కంటే ఆ దుండగులను కాపాడటానికే పోలీసులు ప్రాధాన్య మిస్తున్నట్టు కనబడుతోంది. దీనిపై నిష్పక్షపాతంగా విచారణ చేయడం యోగి సర్కార్ సవాల్‌గా తీసుకోవాలి. దుండగులను శిక్షించడంతో పాటు.. బాధిత కుటుంబానికి అండగా నిలవాలి. అలాగే ఇలాంటి ఘటనలు జరక్కుండా కఠిన చర్యలకు ఉపక్రమించడం కూడా తక్షణావసరం.

ఆర్మీ ఆస్పత్రిలో ట్రంప్‌కు ప్రత్యేక చికిత్స

-ఆరోగ్యం నిలకడగానే ఉందని వ్యక్తిగత వైద్యుల ప్రకటన

వాషింగ్టన్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ బారిన పడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆస్పత్రిలో చేరారు. వాషింగ్టన్ శివారు ప్రాంతం బేథెస్డాలో ఉన్న వాల్టర్ రీడ్ మిలిటరీ ఆస్పత్రిలో ఆయనకు ప్రత్యేక వైద్య బృందం చికిత్స అందిస్తోంది. తనకు వైరస్ సోకినట్లు ప్రకటించినప్పటి నుంచి శ్వేతసౌధంలోనే క్వారంటైన్‌లో ఉన్న ఆయన వైద్యుల సూచన మేరకు శుక్రవారం సాయంత్రం ఆస్పత్రిలో చేరేందుకు అంగీకరించారు. మాస్కు ధరించి హెలికాప్టర్‌లో ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడి నుంచే ఆయన విధులు నిర్వర్తించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రస్తుతానికి ఎన్నికల ప్రచారానికి పూర్తిగా దూరంగా ఉండే అవకాశం ఉందన్నారు. తాను, ప్రథమ మహిళ మెలనియా ట్రంప్ ఆరోగ్యంగానే ఉన్నట్లు ట్రంప్ తెలిపారు. వాల్టర్ రీడ్‌కు చేరుకునే ముందు 18 సెకన్ల నిడివి గల ఓ వీడియోను ట్వీట్ చేశారు. నాకు మద్దతుగా నిలుస్తున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. నేను వాల్టర్ రీడ్ ఆస్పత్రికి వెళ్తున్నాను. నాకు తెలిసి నేను బాగానే ఉన్నాను. అయినా, అన్నీ సవ్యంగా ఉండాలనే మేం ఆస్పత్రికి వెళ్తున్నాం. ప్రథమ మహిళ కూడా బాగానే ఉన్నారు. అందరికీ ధన్యవాదాలు. నేను ఇది ఎప్పటికీ మర్చిపోలేను అని వీడియో సందేశంలో ట్రంప్ అన్నారు. కొవిడ్-19 నుంచి బయటపడేందుకు ట్రంప్ తీసుకుంటున్న ఔషధాల జాబితాను ఆయన వ్యక్తిగత వైద్యుడు డా.సీన్ కాన్లే వెల్లడించారు. అధ్యక్షుడికి వైరస్ సోకినట్లు పీసీఆర్‌లో నిర్ధారణ అయిన తర్వాత, ముందు జాగ్రత్తగా రెజెనెరాన్‌కు చెందిన 8 గ్రాముల డోసు గల పాలీక్లోనల్ యాంటీబాడీ కాక్‌టెయిల్ తీసుకున్నారు. దీంతోపాటు జింక్, విటమిన్-డి, ఫామోనిటిడైన్, ఆస్పిరిన్, మెలటోనిన్ తీసుకుంటున్నారు అని ఓ ప్రకటనలో తెలిపారు. పాలీక్లోనల్ యాంటీబాడీ కాక్‌టెయిల్ ప్రస్తుతం ప్రయోగాత్మక దశలోనే ఉండడం గమనార్హం. ఇది కొవిడ్ లక్షణాలు మరింత ముదరకుండా రక్షిస్తుందని భావిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నానికి కొంత అలసినట్లు కనిపించినా.. ట్రంప్ ఆరోగ్యంగానే ఉన్నారని వెల్లడించారు. వైద్యనిపుణుల బృందం నిరంతరం ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తోందన్నారు. తదుపరి తీసుకోవాల్సిన అత్యుత్తమ చికిత్సా విధానాలను ఎప్పటికప్పుడు సిఫార్సు చేస్తుందన్నారు. ప్రథమ మహిళకు స్వల్ప తలనొప్పి, దగ్గు మినహా పెద్ద లక్షణాలేమీ లేవని తెలిపారు. మిగతా కుటుంబ సభ్యులందరికీ నెగెటివ్ వచ్చినట్లు వెల్లడించారు.

ట్రంప్ దంపతులు కరోనా నుంచి త్వరగా బయటపడాలంటూ ప్రపంచవ్యాప్తంగా సానుభూతి వ్యక్తం అవుతోంది. తాజాగా ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సైతం ట్రంప్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ట్రంప్ దంపతుల ఆరోగ్యం పట్ల కిమ్ సానుభూతి వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా వాళ్లు దీని నుంచి బయటపడతారని ఆకాంక్షించారు. త్వరలో వారు కరోనాను కచ్చితంగా జయిస్తారని.. అక్కడి అధికారిక మీడియా కేసీఎన్ఏ ప్రకటన విడదల చేసింది. ఇప్పటికే ప్రపంచ దేశాల అధినేతలు ట్రంప్ దంపతుల ఆరోగ్యంపై సానుభూతి సందేశాలు పంపిన విషయం తెలిసిందే.

ఎపి,యూపిలకు ఆర్థిక అండ

ఆర్థికంగా నిలదొక్కునేలా కేంద్రం అనుమతి
కొత్తగా రుణాలు పొందేలా వెసలుబాటు
ఎపికి కలసిరానున్న కేంద్ర నిర్ణయం

న్యూఢిల్లీ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ప్రస్తుతం కరోనా వైరస్ వల్ల రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితి దిగజారి ఆదాయం తగ్గుతోంది. ఈ ఆర్థిక అవసరాలు తీర్చేందుకు యూపీ, ఏపీలు రూ.7106 కోట్ల అదనపు రుణాలు తీసుకునేందుకు కేంద్ర ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 'ప్రజా పంపిణీ వ్యవస్థ, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సంస్కరణలు విజయవంతంగా అమలు చేసినందుకు ఆంధ్రప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలు అదనంగా రుణం తీసుకునేందుకు కేంద్రం ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చింది. ' అంటూ ఆర్థిక శాఖ జారీ చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. కేంద్రం అనుమతి ఇవ్వడంతో ఆయా రాష్ట్రాలు అదనంగా రూ.7106 కోట్లు నిధులు అందుబాటులోకి వస్తాయని తెలిపింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సంస్కరణలు అమలు చేసినందుకు రూ.2525 కోట్లు, వన్ నేషన్ - వన్ రేషన్ కార్డు విధానాన్ని విజయవంతంగా అమలు చేసినందుకు మరో రూ.4,851 కోట్లు అదనంగా రుణాలు పొందేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ సంస్కరణలు విజయవంతంగా అమలు చేసిన మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. దీని వల్ల అదనంగా రూ.2525 కోట్ల నిధులను ఓపెన్ మార్కెట్ నుంచి పొందేందుకు ఏపీకి అనుమతి లభించింది. దీంతోపాటు ఏపీ ప్రజా పంపిణీ వ్యవస్థలో సంస్కరణలు, వన్ నేషన్ - వన్ రేషన్ కార్డు విధానాన్ని కూడా అమలు చేసింది. గత వారం ఏపీ, తెలంగాణ, గోవా, కర్ణాటక, త్రిపుర రాష్ట్రాలు అదనంగా రూ.9913 కోట్ల రుణాలు పొందేందుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. వన్ నేషన్ - వన్ రేషన్ కార్డు విధానంలో సంస్కరణలు విజయవంతంగా అమలు చేసినందుకు ఈ రుణాలు పొందేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ప్రజా పంపిణీ వ్యవస్థలో సంస్కరణలు అమలు చేసిన ఆరో రాష్ట్రంగా ఉత్తర్ ప్రదేశ్ నిలిచింది. అలాగే, వన్ నేషన్ వన్ రేషన్ సిస్టమ్‌ను అమలు చేసింది.కరోనా వైరస్ సమయంలో రాష్ట్రాలకు ఆదాయం తగ్గడంతో ఈ ఏడాది మేలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమ జీఎస్‌డీపీలో అదనంగా 2 శాతం రుణాలు తీసుకునేందుకు అనుమతి ఇచ్చింది. 2020 - 21 సంవత్సరానికి కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. దీని వల్ల రూ.4,27,302 కోట్ల రుణాలు తీసుకునేందుకు అనుమతి లభించింది. అయితే, అందుకు కొన్ని కండిషన్లు పెట్టింది. రాష్ట్ర స్థాయిలో నాలుగు అంశాల్లో సంస్కరణలు అమలు చేసేందుకు అంగీకరిస్తేనే అందులో ఒక శాతం రుణం తీసుకోవాలి. అంటే ఒక్కో అంశంలో సంస్కరణకు జీఎస్‌డీపీలో 0.25 శాతం అదనపు రుణం పొందవచ్చన్నమాట. అందులో వన్ నేషన్ - వన్ రేషన్ కార్డు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, అర్బన్ లోకల్ బాడీ యుటిలిటీ రిఫార్మ్, విద్యుత్ రంగంలో సంస్కరణలు ఉన్నాయి.

ఏపీ ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంది. సంక్షేమ పథకాలు, జీతాలు, ఇతర చెల్లింపులకు నిధుల కోసం వెతుకుతోంది. ఈ క్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ అదనంగా రూ.7106 కోట్ల రుణం తీసుకునేందుకు ఆమోదం తెలపడంతో వైసీపీ ప్రభుత్వానికి ఉపశమనం లభించనుంది.

మానవ ప్లాస్మా కన్నా గుర్రం ప్లాస్మా బెటర్

పరిశోధనల్లో మంచి ఫలితాలు
బయలాజికల్ ఇవాన్స్ ముందడుగు

న్యూఢిల్లీ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): కరోనా చికిత్సకు మరో ప్లాస్మా ఆయుధం మరో రూపంలోనూ పనిచేయబోతోంది. మానవ ప్లాస్మా స్థానంలో గుర్రాల నుంచి సేకరించిన ప్లాస్మా ఇంకా బాగా పనిచేస్తుందని పరిశోధకులు అంటున్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న బయోలాజికల్ -ఈ సంస్థ ఈ ఘనతను సాధించింది.

విడ్ బారిన పడ్డ వారి రక్తం నుంచి యాంటీబాడీలతో కూడిన ప్లాస్మా గురించి మనం వినే ఉంటాం. పలు ప్రాంతాల్లో కోవిడ్ చికిత్స కోసం ప్లాస్మా థెరపీని వినియోగిస్తున్నారు. అయితే బయోలాజికల్ -ఈ సంస్థ మనుషుల ప్లాస్మా స్థానంలో గుర్రాల నుంచి సేకరించిన ప్లాస్మాను వినియోగించడం విశేషం. నిర్వీర్యం చేసిన కరోనా వైరస్‌ను గుర్రాల్లోకి ఎక్కించి.. యాంటీబాడీలు ఉత్పత్తి అయిన తరువాత సేకరించి శుద్ధి చేస్తారు. ఈ కొత్త పద్ధతిపై మానవ ప్రయోగాలు ఇంకా జరగాల్సి ఉందని, త్వరలోనే డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియాను ఈ విషయమై సంప్రదిస్తామని భారత వైద్య పరిశోధన సమాఖ్య ఐసీఎంఆర్ శాస్త్రవేత్త సమైరన్ పాండా తెలిపారు.

గుర్రం నుంచి వేరు చేసి శుద్ధి చేసిన రక్తంలో శక్తిమంతమైన యాంటీబాడీలు ఉంటాయని, వైరస్ బారిన పడ్డ వారికి నేరుగా అందివ్వవచ్చునని అంచనా. గతంలోనూ పలు వైరస్, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల కోసం జంతువుల రక్తంలో యాంటీబాడీలను వృద్ధి చేసి వాడారు. కోవిడ్ రోగుల రక్తం నుంచి వేరు చేసిన ప్లాస్మాతో పోలిస్తే గుర్రపు సీరమ్‌లో యాంటీబాడీలు ఎక్కువగా ఉంటాయని, వైరస్‌ను వేగంగా చంపగల సామర్థ్యం కలిగి ఉంటాయని ఐసీఎంఆర్ తెలిపింది. అధ్యయనంలో భాగంగా పది గుర్రాలకు నిర్వీర్యం చేసిన కరోనా వైరస్‌ను ఎక్కించి 21 రోజుల తరువాత దాని ప్లాస్మాను పరీక్షించారు. ఈ ప్లాస్మాలో ఐజీజీ యాంటీబాడీలు ఉన్నట్లు స్పష్టమైంది.

స్పుత్నిక్ ట్రయల్స్‌కు సిద్ధం అవుతున్న రెడ్డీస్

న్యూఢిల్లీ: ఫార్మా దిగ్గజం, హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ కరోనాకు రష్యా రూపొందించిన స్పుత్నిక్-వీ టీకాపై మూడో దశ క్లినికల్ ట్రయల్స్‌కు సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగా దేశంలో మూడోదశ క్లినికల్ ట్రయల్స్ చేపట్టేందుకు అనుమతి కోరుతూ డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ)కి ఫార్మాసంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ దరఖాస్తు చేసుకుందని అధికార వర్గాలు తెలిపాయి. భారత్‌లో స్పుత్నిక్-వీపై ట్రయల్స్ చేపట్టేందుకు రష్యన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఆర్డీఐఎఫ్)తో ఇంతకుముందే రెడ్డీస్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులోభాగంగా వంద మిలిన్ల డోస్ వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయనుంది.

త్వరగా వ్యాక్సిన్ వచ్చే అవకాశాలు తక్కువే

సాధారణ ప్రజలకు 2020-21 ఏడాది మధ్య నాటికి కూడా సమర్థవంతమైన వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చే అవకాశం లేదని వ్యాక్సిన్‌ల అభివృద్ధిలో నిమగ్నమైన కొందరు నిష్ణాతులు చెప్పారు. కెనడాలోని మెక్‌గిల్ విశ్వవిద్యాలయ పరిశోధకులు, 2020 జూన్ చివరలో టీకా తయారీ రంగంలో పనిచేస్తున్న 28 మంది పరిశోధకులపై ఒక సర్వే నిర్వహించారు. అమెరికా చెపుతున్నట్టు 2021 నాటికి వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని వీరిలో చాలా మంది చెప్పారని మెక్‌గిల్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జొనాథన్ కిమ్మెల్మాన్ అన్నారు. కనీసం 2022 నాటికైనా అందుబాటులోకి వస్తే అది గొప్ప విషయమేననీ, సమర్థవంతమైన వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చే ముందు, వ్యాక్సిన్ తయారీలో కొన్ని తప్పులు దొర్లే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

దేశంలో వైరస్ తీవ్ర స్థాయిలో విజృంభణ

లక్షదాటిన కరోనా మరణాల సంఖ్య
24 గంటలలో మరో 1069 మంది మృతి

న్యూఢిల్లీ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ తీవ్ర స్థాయిలో విజృంభిస్తోంది. పాజిటివ్ కేసులతో పాటు మరణాల సంఖ్యా పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వైరస్ పురుడుపోసుకుని దాదాపు పదినెలలకు పైగా కావస్తున్నా ఇప్పటి వరకు వ్యాక్సిన్ అందుబాటులోకి రాకపోవడం కలవర పెడుతోంది. ఈ ఏడాది జనవరిలో భారత్‌లోకి ప్రవేశించిన మహమ్మారి.. ప్రజలపై వంజా విసురుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం.. దేశంలో కరోనా వైరస్ మరణాల సంఖ్య లక్ష దాటింది. కోవిడ్ ధాటికి ఇప్పటి వరకు 1,00,842 ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్ర వైద్యారోగ్యశాఖ శనివారం విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో పేర్కొంది. గడిచిన 24 గంటలలో కరోనా సోకి 1069 మంది మృతి చెందడం అధికారులను, ప్రభుత్వాలను తీవ్ర కలవరానికి గురిచేస్తోంది. ఇక దేశ వ్యాప్తంగా పాజిటివ్ కేసుల సంఖ్య 64,73,545కి చేరింది. తాజాగా ఒక్కరోజులోనే 79,476 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. గడిచిన 24 గంటలలో వైరస్ నుంచి కోలుకుని 75,628 మంది డిశ్చార్జ్ అయ్యారు. దీంతో ఇప్పటి వరకు డిశ్చార్ అయిన వారి సంఖ్య 54,27,706కి చేరడం కొంత ఊరట కలిగిస్తోంది. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 9,44,996 యాక్టీవ్ కేసులు ఉన్నాయి. కరోనా రోగుల రికవరీ రేటు 83.84 శాతంగా నమోదు కాగా.. మొత్తం కేసులలో యాక్టివ్ కేసుల శాతం 14.60 శాతం ఉంది. ఇక గడచిన 24 గంటలలో 11,32,675 కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఇప్పటి వరకు 7,78,50,403 పరీక్షలు నిర్వహించినట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ పేర్కొంది.

దిల్లీ: దేశంలో కరోనా విలయతాండవం ఇంకా కొనసాగుతూనే ఉంది. శుక్రవారం ఒక్కరోజే కరోనా నుంచి 75,628 మంది కోలుకున్నారు. దేశవ్యాప్తంగా రికవరీ రేటు 83.84 శాతంగా, మరణాల రేటు 1.56 శాతంగా ఉంది.

మరోమారు పట్టుకోసం బిజెపి యత్నం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా వ్యూహం
జోరుగా కొనసాగుతున్న పట్టబద్ర ఓటరు నమోదు

నారాయణపేట,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఎమ్మెల్సీ ఎన్నికలను బీజేపీ సవాల్‌గా తీసుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే నారాయణపేట ప్రాంతంలో ఆ పార్టీకి పట్టుంది. ప్రస్తుత ఎమ్మెల్సీ రాంచందర్‌రావుకు ఈ ప్రాంతంలోనే అధికంగా ఓట్లు పడ్డాయనేది బీజేపీ వాదన. ఈసారి సైతం బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు ఆ పార్టీ రాష్ట్ర నేతలు నాగూరావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి కృషి చేస్తున్నారు. ఈ మేరకు బీజేపీలోని పట్టభద్రులైన కార్యకర్తలను సమీకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఓటర్లను ఆకట్టుకునే దిశగా ప్రణాళికలను రూపొందించే పనిలో పడ్డారు. మాజీ మంత్రి డీకే అరుణ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా నియమించటంతో బలం చేకూరిందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పనిచేస్తామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నేరవేర్చని దుస్థితిలో ఉందని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల కూపంలో పడేశారని, రూ.మూడు లక్షల కోట్లు అప్పు తెచ్చి రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్రం ప్రభుత్వానివేనని పేర్కొన్నారు. టీఆర్ఎస్ నాయకుల ఆర్భాటం ఎక్కువైందని, ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు వివరిస్తామన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు పక్రియ ప్రారంభమైంది. ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు రంగంలోకి దిగి ఓటరు నమోదుపై దృష్టి సారించాయి. నాయకులు, కార్యకర్తలతో ముఖ్యనేతలు సమావేశాలు నిర్వహించి ఓటరు నమోదు, ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఖాళీ కానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఓటరు నమోదు పక్రియ గురువారం ప్రారంభమైంది. దీంతో జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో ఎక్కడెక్కడ ఎంతమంది పట్టభద్రులు ఉన్నారో నాయకులు జల్లెడపడుతున్నారు. నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి అర్హులందరూ ఓటరు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిశా నిర్దేశంతో జిల్లాలోని ప్రజాప్రతినిధులు,పార్టీ నేతలు ముందుకు సాగుతున్నారు.

ఇప్పటికే మక్తల్‌లో ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులు, యువకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. నారాయణపేట, కొడంగల్ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి సైతం ఈ ఎన్నికల్లో ఎలాగైనా తమ పార్టీ అభ్యర్థులకు ఎక్కువ సంఖ్యలో ఓటు వేయించేలా పార్టీల్లోని పట్టభద్రులైన యువతతో కార్యాచరణ రూపొందిస్తున్నారు. గ్రామస్థాయి నుంచి ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ యువ నాయకులు పట్టభద్రుల ఓటర్లకు గాలంవేసే పనిలో పడ్డారు. ఇటీవల ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ట్విట్టర్ ద్వారా వెల్లడించిన సిఎం యోగి

లక్నో,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): మహిళలు,అభాగ్యుల రోణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందిన ఉత్తరప్రదేశ్ సిఎం యోగి అన్నారు. అఘాయిత్యాలకు పాల్పడే వారిని ఎవరినీ ఉపేక్షించేది లేదని అన్నారు. హత్రాస్‌లో 20 ఏళ్ల దళిత మహిళ సామూహిక అత్యాచారం, హత్య అదేవిధంగా కేసులో యూపీ పోలీసులు వ్యవహరించిన తీరుపై సీఎం యోగీ ఆదిత్యానాథ్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలో సీఎం యోగి శుక్రవారం ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ... అందరి సోదరీమణుల, తల్లుల రక్షణ, భద్రత, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. యూపీలో తల్లులు, కూతుళ్లపై చెడు ఆలోచనలు వస్తేనే భయపడేలా ఓ ఊదాహరణగా నిలిచేలా చర్యలు తీసుకుంటామాని హామీ ఇచ్చారు. భవ

రాజ్‌భవన్ రాజకీయాలకు వేదిక కాదు

కాంగ్రెస్ నేతల ఆరోపణలపై స్పందించిన గవర్నర్

ఎవరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): రాజ్‌భవన్ రాజకీయ కార్యకలాపాలకు అడ్డా కాదని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అభిప్రాయ పడ్డారు. కరోనా కారణంగా తాను ఎవరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని, అయితే తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేయడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆరోపణలపై తాజాగా గవర్నర్ స్పందిస్తూ కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యల్ని ఖండించారు. కరోనా కారణంగానే ఎవరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. రాజకీయ డ్రామా చేయడానికి రాజ్‌భవన్ అడ్డా కాదని తమిళిసై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. 4 నెలలుగా రాజ్‌భవన్ ఇదే విధానాన్ని అవలంభిస్తోందని.. ఈ-మెయిల్ ద్వారా ఎవరైనా, ఎప్పుడైనా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. రాజ్‌భవన్‌కు రాజకీయాలు ఆపాదించడం సరికాదన్నారు. తాను డాటర్ ఆఫ్ తమిళనాడు, సిస్టర్ ఆఫ్ తెలంగాణ. తొందరలోనే తెలుగు నేర్చుకుంటానని అన్నారు. కరోనా కేసుల రికవరీలో తెలంగాణ రాష్ట్రం ముందుంది. ప్రభుత్వం చేపట్టిన నివారణా చర్యలతోనే రాష్ట్రంలో కరోనా అదుపులో ఉంది. తెలంగాణ రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా ఉండటం గర్వంగా ఉందని తమిళిసై తెలిపారు. మరోవైపు శుక్రవారం నాడు ముఖ్యమంత్రి కేసీఆర్.. గవర్నర్ తమిళిసైతో సమావేశమయ్యారు. అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్‌లో మహాత్మాగాంధీకి సీఎం నివాళ్లు అర్పించిన అనంతరం అక్కడి నుంచి నేరుగా రాజభవన్‌కు వెళ్లిన ఆయన పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా.. గవర్నర్ తమిళిసై భర్త డాక్టర్ సౌందర్ రాజన్‌ను కేసీఆర్ సన్మానించారు.

స్వచ్ఛ అవార్డును అందుకున్న పంచాయితీరాజ్ సెక్రటరీ

-వర్చువల్ పద్ధతిలో అందచేసిన కేంద్రమంత్రి

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): స్వచ్ఛ భారత్‌లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిన తెలంగాణకు కేంద్ర జల్ శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ శుక్రవారం వర్చువల్ పద్ధతిలో అవార్డును అందచేశారు. గాంధీ జయంతి, స్వచ్ఛ భారత్ దివస్ సందర్భంగా ఈ అవార్డుని తెలంగాణ రాష్ట్రం తరపున రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పారిశుద్ధ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎం.రఘునందన్ రావు, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ ఎస్.దిలీప్ కుమార్, రాష్ట్ర స్వచ్ఛ భారత్ మిషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు. కేంద్ర మంచి నీరు - పారిశుద్ధ్య శాఖ గత సంవత్సరం మూడు రకాల ప్రచారాలను ప్రారంభించింది. నవంబర్ 1 నుండి ఏప్రిల్ 30 వరకు స్వచ్ఛ సుందర్ సముదాయిక్ షౌచాలయ కార్యక్రమం, 15 జూన్ నుండి 15 సెప్టెంబర్ 2020 వరకు సముదాయిక్ షౌచాలయ అభియాన్ కార్యక్రమం, ఆగస్టు 8 నుండి ఆగస్టు 15 వరకు కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణానికి, జిల్లాలు, గ్రామాలను సమీకరిస్తూ, దేశంలో చెత్త, వ్యర్థాలను తొలగించేందుకు గందగీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే వరసగా మూడో సారి మొదటి స్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించింది. కాగా ఈ సారి కరీంనగర్ జిల్లా దేశంలోనే 3వ స్థానంలో నిలిచింది.

నగరాభివృద్ధికే రోడ్డు వెడల్పు కార్యక్రమాలు

-ఇల్లు కోల్పోయిన వారిని ఆదకుంటాం: మంత్రి పువ్వాడ

ఖమ్మం,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఖమ్మం నగరాభివృద్ధిలో భాగంగా రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోతున్న వారిని ఆదుకుంటామని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హామీ ఇచ్చారు. ఖమ్మం ముస్తఫా నగర్- బోనకల్ రోడ్ వెడల్పు పనుల్లో ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హామీ ఇచ్చారు. రోడ్డు వెడల్పు పనుల్లో స్వల్పంగా ఇండ్లు కోల్పోయిన వారికి అక్కడే క్రమబద్ధీకరిస్తామన్నారు. పూర్తిగా ఇండ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు గాని ఇండ్ల స్థలం గాని ఇస్తామన్నారు. మీకు ఎలాంటి ఇబ్బంది లేదని మిమ్మల్నిగుండెల్లో పెట్టుకుంటామన్నారు. ఖమ్మం నగరాన్ని విస్తరించి అభివృద్ధి పథంలోకి తీసుకురావలన్నదే తన అభిమతం అన్నారు. భవిష్యత్ లో మిమ్మల్ని ఎవరు ఇబ్బందులు పెట్టకుండా ఉండేలా పకడ్బందీగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన పని లేదని అందరికి న్యాయం జరుగుతుందన్నారు. అభివృద్ధిలో సహకరిస్తున్న మీకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ విజయ్ కుమార్ కార్పొరేటర్లు మందడపు మనోహర్, కమర్తపు మురళి, పి నీరజ, నాయకులు పిల్లి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ తొలగించేందుకు అంగీకరించిన మజీద్ కమిటీకి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రూ.5 లక్షలు అందజేశారు. మళ్లీ కాంప్లెక్స్ నిర్మాణంకు తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు.. మిగిలిన స్థలంలో ఆయా షాపింగ్ కాంప్లెక్స్ ను తిరిగి నిర్మించేందుకు సొంత డబ్బులను అందజేశారు.

జనవరిలో కరోనా వ్యాక్సిన్

గుడ్‌న్యూస్ చెప్పిన ఎయిమ్స్

న్యూఢిల్లీ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): కరోనా కేసులు దేశంలో రోజు రోజుకు పెరిగిపోతున్న తరుణంలో ఎయిమ్స్ శుభవార్త అందించింది. కరోనా వాక్సిన్ వచ్చే వరకు వైరస్ తో సహజీవనం చేయక తప్పనిసరి పరిస్థితి. అయితే, దేశంలో మూడు కంపెనీలు వాక్సిన్ తయారీలో నిమగ్నమై ఉన్నాయి. వివిధ దశల్లో ట్రయల్స్ లో ఉన్నాయి. త్వరలోనే ఈ ట్రయల్స్ పూర్తికానున్నాయి. దేశంలో వ్యాక్సిన్ ఎప్పుడు రిలీజ్ అవుతుందనే దానిపై ఇప్పటికే అనేక రకాల అనుమానాలు కలుగుతున్న సంగతి తెలిసిందే. కరోనా వాక్సిన్ పై ఎయిమ్స్ డైరెక్టర్ రణదీప్ గులేరియా కీలక ప్రకటన చేశారు. జనవరిలో ఇండియాలో వాక్సిన్ రిలీజ్ కాబోతున్నట్టు తెలిపారు. అన్ని దశలను పూర్తి చేసుకొని వాక్సిన్ రిలీజ్ చేస్తారని తెలిపారు. వాక్సిన్ రిలీజ్ తరువాత, దేశంలో ఒకేసారి అందరికి వాక్సిన్ అందుబాటులో ఉండేంతగా ఉత్పత్తి జరగదని, భారీ స్థాయిలో ఉత్పత్తి జరగాలంటే సమయం పడుతుందని తెలిపారు. మొదట కరోనా ముప్పు అధికంగా ఉన్నవారికి మొదట వాక్సిన్ అందుబాటులో ఉంటుందని తరువాత మిగిలినవారికి అందుబాటులో ఉంటుందని తెలిపారు.

దుర్గగుడి ఫ్లై ఓవర్‌కు మరోమారు ముహూర్తం ఖరారు

-16న ప్రారంభించనున్న కేంద్రమంత్రి గడ్కరీ

విజయవాడ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన విజయవాడలోని కనకదుర్గ ఫ్లై ఓవర్ వంతెన ప్రారంభోత్సవానికి ఈ నెల16న మళ్లీ ముహూర్తం పెట్టారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కలిసి రహదారిని ప్రారంభిస్తారని రహదారులు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు తెలిపారు. వర్చువల్ విధానంలో ఇరువురు నేతలూ పైవంతెనను ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మరికొన్ని ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, భూమి పూజ కార్యక్రమాల్లోనూ కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ పాల్గొంటారని ఆయన అన్నారు. పై వంతెనతో పాటు పూర్తయిన మరికొన్ని ప్రాజెక్టులను నితిన్ గడ్కరీ, సీఎం జగన్ జాతికి అంకితం చేస్తారని కృష్ణబాబు వెల్లడించారు. అలాగే ఈ నెల 16 ఏపీలోని పలు ప్రాజెక్ట్‌లకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వర్చ్యువల్‌గా శంకుస్తాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొననున్నారు. దాదాపు రూ.7,584 కోట్ల విలవ చేసే 16 ప్రాజెక్ట్‌లకు కేంద్రమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే రూ.8,038 కోట్ల విలువ చేసే పది ప్రాజెక్ట్‌లను జాతికి అంకితం చేయనున్నారు. మొత్తం రూ.15,622 కోట్ల ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన జరుగనుంది. కనకదుర్గ ఫ్లై ఓవర్‌ను నితిన్ గడ్కరీ16వ తేదీన ప్రారంభిస్తారని ఎంపీ కేశినేని నాని కూడా తెలిపారు. ప్రారంభ తేదీని ఎంపీ కేశినేని నాని ట్విట్టర్ వేదికగా ఖరారు చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా జరగనుందని ఆయన ప్రకటించారు. వాస్తవానికి గత నెల 18న ప్రారంభం కావాల్సినప్పటికీ నితిన్ గడ్కరీకి కరోనా పాజిటివ్ రావడంతో వాయిదా పడిందన్నారు. ప్రస్తుతం ఆయన కోలుకున్నారని కేశినేని నాని తెలిపారు.

ఎంఆర్ కాలేజీ ప్రైవేటీకరణ తగదు: కళా

విజయవాడ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): విజయనగరం ఎంఆర్ కాలేజీ ప్రైవేటీకరణను ఖండిస్తున్నామని టీడీపీ నేత కళా వెంకట్రావు ప్రకటించారు. మాజీమంత్రి అశోక్ గజపతిరాజుపై కక్షతో మాన్సాస్ ట్రస్ట్‌ను నిర్వీర్యం చేయడం హేయమన్నారు. పంచ భూతాలను దోచుకోవడం సీఎం జగన్ నైజమన్నారు. పాదయాత్ర సమయంలోనే జగన్‌రెడ్డి కన్ను మాన్సాస్‌పై పడిందని, మాన్సాస్ ట్రస్ట్‌ను భ్రష్టుపట్టించడమే లక్ష్యంగా.. ఏ1, ఏ2లు తెరవెనుక పావులు కదుపుతున్నారని కళా వెంకట్రావు ధ్వజమెత్తారు.

ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలు పాటించాల్సిందే

కరోనా ముప్పు అప్పుడే తొలగిపోలేదు

ఎవరికి వారు వైరస్ బారిన పడకుండా చూసుకోవాలి

ఇండియాటుడే అవార్డుల కార్యక్రమంలో మంత్రి హర్షవర్ధన్

న్యూఢిల్లీ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): దేశంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కోవిడ్-19 నిరోధక మార్గదర్శకాలను పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం ప్రదర్శించరాదని కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ కోరారు. ఈ మార్గదర్శకాలను పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మన దేశంలో కోవిడ్-19 ఇన్ఫెక్షన్ వ్యాప్తి గొలుసును తెంచడం కష్టమవుతుందని చెప్పారు. మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం తప్పనిసరి అని, ప్రజలు తమను తాము ఈ వైరస్‌కు గురికాకుండా కాపాడుకోవాలని చెప్పారు. ఇండియా టుడే' హెల్త్ గిరి అవార్డుల ప్రదానోత్సవంలో డాక్టర్ హర్షవర్ధన్ శుక్రవారం మాట్లాడారు. కరోనా వైరస్ నుంచి కాపాడే అతి పెద్ద రక్షకుడిగా మాస్క్ పని చేస్తుందని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్‌ను తప్పనిసరిగా, ఎల్లప్పుడూ ధరించాలని తెలిపారు. ఇటీవల వ్యాపార సంస్థలు తెరుచుకోవడంతో, చాలా మంది కరోనా వైరస్ నిరోధక మార్గదర్శకాలను పాటించడంలో అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వివిధ దశల్లో అన్‌లాక్ జరుగుతోందని, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించడంలో ప్రజలు అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు గమనిస్తున్నామని చెప్పారు. కోవిడ్-19కు దూరంగా ఉండాలంటే వ్యక్తుల మధ్య పరస్పర దూరం రెండుగజాలు ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. చేతులను తరచూ శుభ్రపరచుకోవాలని, శానిటైజేషన్ చేసుకోవాలని తెలిపారు. కరోనా వైరస్‌పై ప్రపంచం యుద్ధం ప్రారంభించి 9 నెలలు అవుతోందని, ఇప్పుడు కరోనా యోధులకు వందనం చేయవలసిన సమయమని చెప్పారు. మన దేశంలో కరోనా మహమ్మారి ప్రారంభమైనప్పటి నుంచి పాత్రికేయులు చేస్తున్న కృషిని కూడా డాక్టర్ హర్షవర్ధన్ అభినందించారు. పాత్రికేయులు మన దేశంలోని కరోనా మహమ్మారి పరిస్థితులను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తున్నారన్నారు. పాత్రికేయుల కోసం ప్రత్యేకంగా ఓ టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఓ పాత్రికేయుడు కోరారని, తాను ఆ విధంగా చేయలేక పోయినప్పటికీ, ఈ మహమ్మారి సమయంలో పని చేయడం మానేసిన జర్నలిస్టును తాను చూడలేదని తెలిపారు.

పోలీస్ అధికారుల పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్లు

అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

నల్లగొండ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): పలువురు పోలీసు అధికారుల పేరుతో నకిలీ ఫేసుబుక్ అకౌంట్లు ఓపెన్ చేసి మోసాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యులతో కూడిన అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు.

రాజస్థాన్ రాష్ట్రంలోని భరత్ పూర్ జిల్లా కేత్వాడ మండల కేంద్రానికి చెందిన ముస్తఖీమ్ ఖాన్, మనీష్, షాహిద్, సద్దాం ఖాన్‌లను పోలీసులు అదవులోకి తీసుకున్నారు. వీరిలో మనీష్ మైనర్. నిందితుల నుండి లక్ష నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లు, ఒక లాప్‌టాప్, 30 సిమ్ కార్డులు, నకిలీ ఆధార్ కార్డులు, పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్‌లకు సంబంధించిన వివరాలను ఎస్పీ కార్యాలయంలో డీఐజీ రంగనాథ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 350 మంది పోలీస్ అధికారుల ఫేస్ బుక్ నకిలీ అకౌంట్లు క్రియేట్ చేసినట్లు గుర్తించామన్నారు. తెలంగాణకి చెందిన 81 మంది పోలీస్ అధికారుల పేరుతో నకిలీ ఎఫ్ బి అకౌంట్లు సృష్టించారని చెప్పారు. సులభంగా డబ్బు సంపాదించడం కోసం దక్షిణాది రాష్ట్రాలే లక్ష్యంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఓఎల్ఎక్స్, ఫేస్‌బుక్ అప్లికేషన్స్ అడ్డాగా నేరాలు, ఆర్మీ పేరుతోనూ సైబర్ నేరాలు పాల్పడుతున్నట్లు తెలిపారు. తెలంగాణ పోలీసుల ప్రతిష్ట నిలిపేలా తమ బృందం రాజస్థాన్ వరకు వెళ్ళి ముఠాను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారని డీఐజీ చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా ఫేస్ బుక్ అడ్డాగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాను నల్లగొండ పోలీస్ బృందం ఛేదించిందన్నారు. కేసును చేధించడంలో కీలకంగా పని చేసిన జిల్లా పోలీసులకు అభినందనలు, రివార్డు అందజేయనున్నట్లు తెలిపారు. సైబర్ నేరస్థుల ఉచ్చులో పడి మోసపోవద్దని ప్రజలకు సూచనలు చేశారు. నగదు, సెల్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఐజీ రంగనాథ్ వెల్లడించారు.

రుణగ్రహీతలకు భారీ ఊరట

మారిటోరియం కాలంలో వడ్డీ మాఫీకి కేంద్రం సంసిద్ధత

సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు

న్యూఢిల్లీ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): బ్యాంకు రుణగ్రహీతలకు భారీ ఉపశమనం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కరోనా నేపథ్యంలో విధించిన మారటోరియం కాలంలో రుణాలపై వడ్డీ మాఫీ చేసేందుకు సుముఖత వ్యక్తం చేసింది.. ఈ మేరకు, సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం అఫిడవిట్ దాఖలు చేసింది. దీనిపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరగనుంది.. మార్చి నుంచి ఆగస్టు వరకు నెలవారి చెల్లించాల్సిన రుణాలపై కేంద్రం వడ్డీ మాఫీ చేయనుంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల రుణాలు, విద్యా రుణాలు, గృహరుణాలు, వాహన రుణాలు, క్రెడిట్ కార్డుల రుణాలు, వ్యక్తిగత రుణాలు, ప్రొఫెషనల్ రుణాలపై వడ్డీ మాఫీ కానుంది. ఈ మేరకు, మాజీ కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రాజీవ్ మహర్షి కమిటీ ఇచ్చిన సూచనలను కేంద్రం ఆమోదించింది. అయితే, ఆరునెలలపాటు అన్ని బ్యాంకు రుణాలపై వడ్డీ మాఫీ చేస్తే, బ్యాంకులు కుప్పకూలిపోతాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అలా అన్నిరకాల బ్యాంకు రుణాలపై వడ్డీని మాఫీ చేస్తే సుమారు 6 లక్షల కోట్ల రూపాయల భారాన్ని బ్యాంకులు భరించాల్సి ఉంటుందని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది. ఈ పరిణామం చాలా బ్యాంకుల మూలధనం మొత్తం కరిగి పోవడమే కాకుండా, బ్యాంకుల మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కానీ, ప్రభుత్వం పేర్కొన్న ప్రకారం.. రుణగ్రహీత తాత్కాలిక నిషేధాన్ని పొందారా? లేదా? అనే దానితో సంబంధం లేకుండా వడ్డీపై మాఫీ ఉంటుందని చెబుతోంది. మారటోరియం సమయంలో కొన్ని రకాల రుణాలపై వడ్డీ వదులుకునేందుకు సిద్ధమని కేంద్రం స్పష్టంచేసింది. ఆరు నెలల మారటోరియం కాలంలో రూ.2 కోట్ల వరకుగల రుణాలపై వడ్డీ వదులుకునేందుకు సిద్ధమైనట్లు ప్రభుత్వం కోర్టుకు తెలిపింది.

ఎంఎస్ఎంఈలు, గృహ రుణాలు, విద్యా రుణాలు, వాహన రుణాలు, క్రెడిట్ కార్డు బకాయిలపై, వినియోగదారు వస్తువుల ఈఎంఐలపై వడ్డీలను మినహాయించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ ద్వారా సుప్రీంకోర్టుకు వివరించింది. సమస్యకు వడ్డీ భారాన్ని భరించడమే ఏకైక పరిష్కారమని నిర్ణయించినట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నది. అయితే అన్ని రకాల రుణాలకు వడ్డీని చెల్లించాలంటే రూ.6 లక్షల కోట్లు భారం పడుతుందని, అది చాలా అధికమని, అందుకే రూ.2 కోట్లు ఆ లోపుగల రుణాలకే వడ్డీ చెల్లించాలని నిర్ణయించామని కేంద్రం తెలిపింది. మారటోరియం పీరియడ్ రుణాలకు సంబంధించి సుప్రీంకోర్టులో కేంద్ర సర్కారు సమర్పించిన అఫిడవిట్ రుణగ్రహీతలకు ఊరటనిచ్చేలా ఉందని ఆర్థిక నిపుణులు పేర్కొంటు న్నారు. రుణగ్రహీతలకు వెసులుబాటు కలిగేలా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలలపాటు కేంద్రం మారటోరియం విధించింది. అయితే బ్యాంకింగ్ సంస్థలు మారటోరియం సమయంలో బకాయిలపై వడ్డీలు లెక్కగడుతున్నాయి. ఈ నేపథ్యంలో విషయం కోర్టుకు చేరగా.. కోర్టు ఆదేశాల మేరకు తాజాగా కేంద్రం అఫిడవిట్ సమర్పించింది.

మన మంత్రిని గెలిపిద్దాం అంటూ ప్రచారం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కవిత గెలుపు లాంఛనమే

కాంగ్రెస్, బీజేపీలకు షాక్ ఇవ్వాలన్నదే టిఆర్ఎస్ లక్ష్యం

నిజామాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఈనెల 9న జరగబోయే ఉప ఎన్నిక కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇక్కడి నుంచి సీఎం కేసీఆర్ తనయ కల్వకుంట్ల కవిత పోటీ చేస్తుండటంతో ఈ ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఆమె తదుపరి మంత్రి అని ఇప్పటికే జిల్లాలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆమెకు ముఖ్యమైన పోర్టు పోలియో అప్పగిస్తారని కూడా ప్రచారం చేస్తున్నారు. బహుశా ఫలితాలు రాగానే దసరాకు మంత్రివర్గ విస్తరణ ఉంటుందని..అందులో కవితకు స్థానం కల్పిస్తారని జోరుగా ప్రచారం చేస్తున్నారు. కాబోయే మనమంత్రిని మనమంతా భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలు ప్రచారంలో చెబుతున్నారు. కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీగా గెలువగానే ఆమెను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారని స్థానికంగా జోరుగా ప్రచారం సాగడంతో ఎన్నికపై తీవ్ర ప్రభావం పడనుంది. కీలకమైన శాఖను అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే, ఆరేళ్ళ కాలపరిమితి గల ఈ ఎమ్మెల్సీ పదవీ కాలం 2022 జనవరి 4న ముగియనుంది. అంటే కాలపరిమితి ఇంకా 15 నెలలు మాత్రమే ఉంటుంది. 2016 జనవరి 5న డాక్టర్ భూపతిరెడ్డి ఎమ్మెల్సీగా గెలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయనను పార్టీ ఫిరాయింపుల చట్టం కింద అనర్హుడిగా ప్రకటించారు. దాంతో 2019 జనవరి 16న ఆయన ఎమ్మెల్సీ పోస్టు ఊడిపో యింది. సుమారు 20 నెలలకు పైగా ఖాళీగా ఉన్న ఈ స్థానానికి ఇప్పుడు ఉపఎన్నిక జరగబోతోంది. ఈ క్రమంలో కవిత విజయం సాధిస్తే పదవిలో కొనసాగుతారని అంటున్నారు. కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో ప్రవేశించబోతున్న తరుణంలో కెటిఆర్, కవితలు రాష్ట్రాన్ని చూసుకుంటారని అంటున్నారు.ప్రధానంగా నిజామాబాద్ నగరంలోని బీజేపీ కార్పొరేటర్లు లక్ష్యంగా అధికార పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. 60 డివిజన్లలో కమలం పార్టీకి 28 మంది కార్పొరేటర్లుం డగా, ఇప్పటికే 14 మంది గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. మిగతా వారిని ఆకర్షించేందుకు సంప్రదింపులు జరుగుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 30 మంది జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు అధికార పార్టీకి జై కొట్టేశారు. ఎన్నికల్లో మద్దతు పలికేలా మరికొందరితో ఒప్పందాలు జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన వారంతా గతంలోనే టీఆర్ఎస్‌లో చేరారు. ఇలా కూడగట్టిన మద్దతుదారులతో టీఆర్ఎస్ బలమైన శక్తిగా మారింది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కవిత విజయం ఇప్పటికే దాదాపు ఖాయం చేసుకుంది. అయితే భారీ మెజార్టీతో గగెలవాలన్నదే వ్యూహంగా కనిపిస్తోంది. నేరుగా ఎన్నికల్లో సత్తా చాటే ధైర్యం లేక పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. కవిత గెలిచేందుకు అవసరమైన పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ మిగతా వారిని కూడా రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలకు సాక్ ఇచ్చేలా ఫలితం ఉండాలని టిఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది.మ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో టీఆర్ఎస్ నుంచి కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ అభ్యర్థిగా సుభాష్ రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా లక్ష్మీనారాయణ ఉన్నారు. ఈ ఎన్నికలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని స్థానిక సంస్థల ప్రతినిధులు ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఓటు వేయనున్నారు. మొత్తం 824 మంది ఓటర్లున్న ఈ ఎమ్మెల్సీ స్థానంలో టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే ఎక్కువగా ఉన్నారు. ఎంఐఎం ప్రతినిధులు అధికార పార్టీకి మద్దతు పలుకుతున్నారు. టీఆర్ఎస్, ఎంఐఎం కలిపి 609 మంది ఓటర్లు కవితకు అండగా ఉన్నారు. కాంగ్రెస్‌కు 136 మంది, బీజేపీకి 79 మంది మద్దతుదారులున్నారు. ఎన్నికల సమయం నాటికి కాంగ్రెస్, బీజేపీకి చెందిన మరికొందరు గులాబీ పార్టీకి మద్దతు పలికే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ లెక్కల ప్రకారం టీఆర్ఎస్ అభ్యర్థి కవిత విజయం లాంఛనప్రాయమే కానుంది.

దీక్షలో పాల్గొన్న రుద్రవరం బిజెపి నాయకులు

వేములవాడ, అక్టోబర్ 3 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా లోని కలెక్టరేట్ ముందు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పై 131 జి ఓ రద్దు చేయాలంటూ దీక్ష చేపట్టారు

.ఈ ధర్నా కార్యక్రమంలో వేములవాడ మండల అర్బన్ రుద్రవరం గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా రుద్రవరం ఎం పి టి సి గాలి పెళ్లి సువర్ణ స్వామి గౌడ్ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఆశ చూపి రెండవ సారి గద్దెనెక్కి పేద ప్రజలను మోసం చేయడమే కాకుండా ఎల్.ఆర్.ఎస్ పేరుతో దోచుకుంటున్న నియంతృత్వ టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా యూత్ నాయకుడు కాసర్ల అరుణ్ కుమార్ ,పలువురు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

దళితజాతిపై దాడులకు మద్దతిస్తారా?

-డొక్కా,జూపూడిలపై మండిపడ్డ జవహర్

అమరావతి,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): వైసీపీ దళిత నేతలు జూపూడి ప్రభాకర్ రావు, డొక్కా మాణిక్య వరప్రసాద్‌ల తీరుపై మాజీ మంత్రి, టీడీపీ నేత కే.ఎస్.జవహర్ మండిపడ్డారు. దళితజాతికి అన్యాం జరుగుతుంటే భజన చేయడమే పనా అని మండిపడ్డారు. 'జూపూడి ప్రభాకర్ రావు, డొక్కా మాణిక్య వరప్రసాద్‌లు తమ వ్యక్తిగత, రాజకీయ, ఆర్థిక ఆకాంక్షల కోసం పనిచేస్తూ దళిత మేతావులుగా మారారని మండిపడ్డారు. వైసీపీలో

వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలోని తన ఇంటి పన్నును, నల్లాబిల్లును పంచాయితీ కార్యదర్శికి చెల్లించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

పన్నులు చెల్లింపులతోనే పల్లె ప్రగతి

సకాలంలో ఇంటి,నల్లా పన్నులు చెల్లించాలి
గ్రామాల్లో ఆస్తుల వివరాల నమోదుకు సహకరించాలి
మంత్రి ఎర్రెబ్లలి దయాకర్రావు పిలుపు

వరంగల్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఇంటి, నల్లా పన్నులు చెల్లించి.. పల్లెల ప్రగతికి తోడ్పాటు అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. పన్నులు చెల్లిస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. బకాయిలు పేరుకుపోతే గ్రామాల్లో చెత్త ఎత్తిపోయడం కూడా కష్టం అవుతుందన్నారు. పర్వతగిరిలోని తన నివాసానికి ఇంటి, నల్లా పన్నును గ్రామ పంచాయతీకి మంత్రి దయాకర్రావు చెల్లించారు. తన ఇంటి,నల్లా పన్నులు కట్టి ప్రజలకు ఆదర్శంగా మంత్రి నిలిచారు. ఇంటి, నల్లా పన్నులు కలిపి మొత్తం రూ.5,220ను గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు చెల్లించి రశీదు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలందరూ పన్నులు చెల్లించి బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. పన్నులు చెల్లించి, పల్లెల ప్రగతికి పాటుపడండి అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇదిలావుంటే ధరణి పోర్టల్ ద్వారా ఆస్తుల నమోదు జరుగుతుందని, ఇందులో ఒక్క పైసా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల ఆస్తులకు ఇకనుంచి పక్కాగా హక్కు పత్రం లభించనుందన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నిర్మాణానికి సంబంధించిన లెక్క పక్కాగా ఉండబోతున్నది. ఈ మేరకు జిల్లాలోని గ్రామపంచాయతీ సిబ్బంది ఇంటింటికీ సర్వే ప్రారంభించారు. ఇళ్ల యజమానులు, వారి కుటుంబ సభ్యుల వివరాలను, ఆధార్ నంబర్లను సేకరిస్తున్నారు. అనుమతి లేని ఇండ్లకు అసెస్‌మెంట్ చేస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు అనుమతి ఉన్న ఇండ్లు ఎన్ని, అనుమతి లేనివి ఎన్ని అనే లెక్కను తేలుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో చేపట్టిన అస్తుల ఆన్‌లైన్ పక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. ఇందుకు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కోఆప్షన్ సభ్యులు, మహిళా సంఘం సభ్యులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆస్తుల నమోదు పక్రియను అందరూ సద్వినియోగం చేసుకునేలా పర్యవేక్షించాలని ఆయన కోరారు. ఇంటి నంబర్. యజమాని పేరు, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, కుటుంబ సభ్యుల పేర్లు తీసుకోవాలని, ఒకవేళ అనుమతి లేకుండా నిర్మాణాలుంటే అవి ఏ సర్వే నంబర్‌లో నిర్మించారు, ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని అన్ని ఇళ్లతోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు కొలతలు వేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నూతన భవన నిర్మాణాల అనుమతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే పన్నులు వసూలు చేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో తొలుత ఇంటి నంబర్లు లేని ఇళ్ల వివరాలను సేకరించాలని సూచించారు.

గాంధీ ఆలోచనలే దేశానికి రక్ష

ఎపిలో గాంధీ ఆశయాలను సాగిస్తున్న జగన్ పాలనలో కోర్టుల జోక్యం సరికాదు: డొక్కా

గుంటూరు,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): గాంధీ ఆలోచనలు నేడు దేశానికి ఎంతో అవసరమని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. మత సహనం,దళితుల, ముస్లింలు, పేదలపై దాడులను గాంధీజీ ఆనాడే ఖండించారని గుర్తు చేశారు. అన్నీ కులాలను కలుపుకుని ముందుకు నడిపిన సమగ్ర నాయకత్వం ఆయన సిద్ధాంతాలలో ఉంది. దళితులు, దేవాలయాలపై దాడులు దేశానికి మంచిది కాదన్నారు. గాంధీజీ ఆలోచనలతో సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. . యుపిలో దళిత మహిళను రేప్ చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని,మళ్ళీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యూపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ 151వ జయంతి సందర్భంగా గుంటూరు హిమని సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, లక్ష్మణ్ రెడ్డి, యేసురత్నం తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డొక్కా మాట్లాడుతూ నిజమైన గ్రామ స్వరాజ్యాన్ని ఈరోజు ఆంధ్ర ప్రదేశ్ సాధిస్తోంది. ఆ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. మా ప్రభుత్వం వచ్చాక అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయి. వారిలో 85 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారు ఉన్నారు. ప్రతిపక్ష పార్టీ దళితులపై ఏదో ప్రేమ ఉన్నట్లు ప్రవర్తిస్తోంది. వారి హయాంలో దళితులపై దాడి జరిగితే చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు. జగన్ సీఎం అయ్యాక చట్టపరంగా సీఐ, ఎస్సై స్థాయి వారిపైనా చర్యలు ఉన్నాయి. దేవాలయాలపై దాడులు జరిగాయని టీడీపీ ఆందోళన చేసింది. వాస్తవాలు వెలికి తీస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ప్రభుత్వానికి అండగా ఉన్న దళితులను దెబ్బ కొట్టాలని ప్రయత్నం చేస్తున్నారు. దళిత సంఘాలు వారి మాటలు నమ్మొద్దు. మీకు అండగా ఉండేది మా ప్రభుత్వం. ఆర్థిక వేత్తలు చెప్తున్న ప్రజల్లోకి మనీ ప్లో అనే సూత్రాన్ని ఒక్క జగన్ అమలు చేస్తున్నారని మాణిక్య వరప్రసాద్ అన్నారు.

వైఎస్సార్ కుటుంబానికి కులం లేదు.. మతం లేదు. ప్రతిపక్షానికి దేవాలయాలపై, దళితులపై మీకు ప్రేమ లేదు. దళితులను రెచ్చగొట్టడం, మత కలహాలు సృష్టించడమే పని. ప్రభుత్వాన్ని, జగన్‌ను మీరు ఎన్ని ఇబ్బందులు పెట్టాలని చూసినా అతని ఎజెండా ఎస్సీ, ఎస్టీ, బీసీల ఎజెండా నుంచి జగన్ ఎప్పుడూ పక్కకి వెళ్ళారన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రజలకు న్యాయాన్ని అందించాల్సిన బాధ్యత న్యాయ స్థానాలపై ఉంది. న్యాయ పరిపాలనను వదిలేసి ప్రజా పరిపాలనలో జోక్యం చేసుకుంటే రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చినట్టు అవుతుంది. కోర్టులు న్యాయ సమీక్ష ద్వారా ప్రజలకు న్యాయం అందించాలి. కాని కోర్టు పరిపాలన చేస్తామంటే రాజ్యాంగం అనుమతించదన్నారు. కోర్టుకు అలాంటి పోకడలు మంచిది కాదని, గాంధీజీ విలువలకు అది విరుద్ధం అన్నారు.దీనిపై న్యాయ వ్యవస్థలు ఆలోచనలు చేయాలి. కోర్టులు కూడా సహనం కోల్పోవడం సరికాదు ఓర్పుతో వ్యవహరించాలని డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు.

ఎన్గల్‌లో కరోనా వైద్య శిబిరం...

వేములవాడ, అక్టోబర్ 3 (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో శనివారం కొవిడ్ 19 శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో 88 మందికి కొవిడ్ పరీక్షలు నిర్వహించగా ఇందులో ఏడుగురికి పాజిటివ్ గా రిపోర్టు వచ్చినట్లు వైద్యాధికారి మసూద్ హమ్మద్ తెలిపారు, అలాగే చందుర్తి ప్రభుత్వాసుపత్రిలో 15 మందికి కోవిడ్ పరీక్ష నిర్వహించగా ఇద్దరికీ పాజిటివ్ గా రిపోర్ట్ వచ్చినట్లు ఆయన తెలిపారు, కరోనా సోకకుండా ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, భౌతిక దూరాన్ని పాటించాలన్నారు, బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా మాస్కులు ధరించలన్నారు, ఈ ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రాజమణి, హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, స్టాఫ్ నర్సు సంధ్యారాణి, సూపర్వైజర్ అంజయ్య, ఏఎన్ఎం వజ్ర, ఆశా కార్యకర్తలు గడ్డం జ్యోతి, చంద్రకళ, వసంత, రమణ తదితరులు పాల్గొన్నారు

నగరంలో మరో మహిళా టెక్కీ ఆత్మహత్య

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): నగరంలో మరో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలవన్మరణానికి పాల్పడింది. నార్సింగిలోని హైదర్‌షాకోట్ నరసింహ స్వామి కాలనీలో నివాసముంటున్న రమ్యకృష్ణ ఆత్మహత్య చేసుకున్నది.

సమాచారం తెలుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుని, అక్కడ లభించిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అయితే భార్యా భర్తల మధ్య ఏమైనా కలహాలు ఉన్నాయా, ఇతర ఇబ్బందులైమైనా ఉన్నాయా అనే విషయాలను ఆరాతీస్తున్నారు. మృతురాలు రమ్యకృష్ణకు ఐదేండ్ల క్రితమే వివాహమైంది. ఆమె భర్త గోపీ కూడా సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి కవల పిల్లలు ఉన్నారు. కాగా, తమ మధ్య ఎలాంటి గొడవలు గానీ, ఆర్థిక ఇబ్బందులు కూడా లేవని భర్త గోపీ వెల్లడించారు.

యూపిలో అసలు ప్రభుత్వ వ్యవస్థ ఉందా

వరుస ఘటనలపై మండిపడ్డ గులాంనబీ ఆజాద్

న్యూఢిల్లీ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై నేరాలు విపరీతంగా పెరిగిపోతుండటంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గులాంనబీ ఆజాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలపై వరుసగా లైంగిక దాడులు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నదని చెప్పారు. యూపీలో తరచూ చోటుచేసుకుంటున్న దారుణాలను చూస్తుంటే అసలు అక్కడ ఒక వ్యవస్థ అనేది ఉందా? ఉంటే అది సక్రమంగా పనిచేస్తుందా? అనే అనుమానం కలుగుతున్నదని ఆజాద్ వ్యాఖ్యానించారు. యూపీలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై అకృత్యాలు పెరిగాయన్నారు. గతంలో కూడా అక్కడ ప్రతిపక్ష నేతలపై దాడులు, హత్యలు, తప్పుడు కేసుల బనాయింపు లాంటివి చోటుచేసకుంటున్నాయని ఆజాద్ గుర్తుచేశారు. యూపీలో దారుణాలు జరుగడం కొత్తేమీ కాదని, అది సర్వసాధారణ విషయంగా మారిపోయిందని ఆజాద్ పేర్కొన్నారు.

ఎపిలో మానవహక్కుల ఉల్లంఘన

మానవహక్కుల సంఘానికి వర్ల లేఖ

అమరావతి,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఏపీలో మానవహక్కుల ఉల్లంఘన జరుగుతోందని జాతీయ మానవహక్కుల కమిషన్‌కు తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య లేఖ రాశారు.

దీనిపై ప్రత్యేక కమిటీతో దర్యాప్తు జరిపించాలని ఆయన కోరారు. ఏపీలో 'భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ'ను పూర్తిగా హరిస్తున్నారని ఆయన మండి పడ్డారు. ఎస్సీలపై వరుస దాడులను అరికట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఎస్సీ కుటుంబనీ సజీవదహనానికి ప్రయత్నించినా ఈ ప్రభుత్వంలో చలనం రాలేదని, శిరోముండనం కేసులో అసలు ముద్దాయిలు అరెస్టు కాలేదని వర్ల విమర్శించారు. రాష్ట్రంలో 'రూల్ ఆఫ్ లా' అమలు కావడంలేదని హైకోర్టే వ్యాఖ్యానించిందని ఆయన అన్నారు. డీజీపీని కూడా పలుదఫాలు హైకోర్టుకి పిలిచి, హెచ్చరించినా ప్రభుత్వ పాలనలో మార్పురాలేదని వర్లరామయ్య లేఖలో పేర్కొన్నారు.

మాజీ ఎంపి సబ్బం హరి ఇంటి వద్ద కూల్చివేతలు

నోటీస్ లేకుండా కూల్చివేతపై మండిపడ్డ సబ్బం

విశాఖపట్టణం,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): టీడీపీ నేత సబ్బం హరి ఇంటికి అనుకొని ఉన్న టాయిలెట్ రూమ్‌ని జీవీఎంసీ అధికారులు కూల్చివేసారు. ఇది అక్రమ కట్టడమని అధికారులు పేర్కొన్నారు. అయితే ముందుగా సమాచారం ఇవ్వకుండా జేసీబీలతో ఎలా కూల్చివేస్తారని సబ్బం హరి అధికారులుపై మండిపడ్డారు. కూల్చివేతలపై సమాధానం ఇవ్వడానికి జీవీఎమ్‌సీ అధికారులు నిరాకరించారు. తప్పులను ఎత్తిచూపిన వారిపై కక్షసాధించడమే ప్రభుత్వ ఎజెండానా అని ప్రశ్నించారు. విశాఖలో మాజీ ఎంపీ సబ్బం హరి ప్రహారీ గోడతో పాటు ఆ ప్రాంగణంలోని నిర్మాణాలు కూల్చివేసిన తీరు చూస్తే ఇవే అనుమానాలు కలుగుతున్నాయి. తెల్లవారుజామున 4 గంటలకు జేసీబీలతో వెళ్లిమరీ కూల్చి వేయాల్సిన అవసరం ఏ ముంది కనీసం నోటీసులు ఇవ్వకుండా అంత హడావుడిగా పడగొట్టారని విమర్శలు వస్తున్నారు. ఈ ఘటనతో విశాఖ సీతమ్మధారలోని సబ్బంహరి నివాసం వద్ద తెల్లవారుజామున ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. ఆయన నివాస గృహం ప్రహారీ గోడతోపాటు ఆ ప్రాంగణంలోని నిర్మాణాలను జీవీఎంసీ అధికారులు కూల్చివేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చడంపై సబ్బం హరి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎందుకు కూల్చుతున్నారో కూడా చెప్పకపోవడం ఏంటని మండిప్డారు. ఐదు అడుగుల స్థలానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయని చెప్పినా పట్టించుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆదేశాలు ఎవరిస్తారో తనకు తెలుసని.. వాళ్లు కచ్చితంగా తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలతో తన గొంతును ఎవరూ నొక్కలేరని స్పష్టం చేశారు సబ్బం హరి.

వీడని అజయ్ మృతి మిస్టరీ

పోలీసుల తీరుపై తొలగని అనుమానాలు

విజయవాడ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): అజయ్ అనే యువకుడి మృతి మిస్టరీ ఇంకా వీడలేదు. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో ఎన్ఈబీ పోలీస్ స్టేషన్‌లో అజయ్ మృతి సంచలనం సృష్టించింది. గత నెల 17న విజయవాడ బెంజ్‌సర్కిల్ సమీపంలో కార్గో వాహనంలో మద్యం అక్రమంగా సరఫరా చేస్తున్న మురాసు పోలీసులు అరెస్టు చేశారు. తనిఖీల్లో పార్సిల్ పె÷టటెపై ఓ ఫోన్ నెంబర్‌ను పోలీసులు గుర్తించారు. మధ్యవర్తులు, ఆర్టీసీ సిబ్బందిని ప్రశ్నించారు. పలువురిన అదుపులోకి తీసుకున్నారు. గుప్తా అనే పేరుతో సరుకు బుక్ చేసుకున్నట్లు తెలుసుకున్నారు. ఫోన్ నెంబర్, కాల్ డేటా ఆధారంగా ఆరా తీశారు. కృష్ణలంకకు చెందిన అజయ్ అనే మారుపేరుతో మద్యం అక్రమంగా తీసుకువస్తున్నట్లు గుర్తించారు. పోలీసులు గుప్తా కోసం గాలిస్తుండగా విషయం తెలుసుకున్న అజయ్,

అతని స్నేహితుడు సాయి కృష్ణ పరారయ్యారు. చివరికి వారిని అరెస్టు చేసి కృష్ణలంక ఎస్ఈబీ పీఎస్‌కు తరలించి ప్రశ్నించారు. కొద్దిసేపటికే అజయ్‌ను సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అజయ్ ప్రాణాలు కోల్పోయాడు. విచారణ పేరుతో పోలీసులు చిత్రహింసలు పెట్టడంతోనే అజయ్ ప్రాణాలు కోల్పోయాడని కుటుంబనభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు.

ధరణి పోర్టల్‌పై ప్రజలకు అవగాహన

మోడల్ సిటీగా జవహర్‌నగర్
కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): మోడల్ సిటీగా జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను మారుస్తామని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ నేతి మంగమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి , జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ జాన్ శాంసన్, కాప్రా తహసీల్దార్ గౌతమ్‌కుమార్, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... నివాస హక్కులు లేక అభద్రతా భావంతో ఉన్న ప్రజలకు హక్కులను కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీ ఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చారన్నారు. ఇండ్లు ఉండి వాటిపై హక్కులు లేని 40 వేల ఇండ్ల జాబితాను మంత్రి కేటీఆర్‌కు అందజేశామన్నారు. జీవో 58,59 అమలు పై జవహర్‌నగర్ ప్రజలు దసరా వరకు మంచి శుభవార్తను వింటారని తెలిపారు. అనంతరం కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2016లో ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నంబర్ 298,299 సూపర్ అసిస్‌మెంట్ టాక్స్ ప్రకారంగా ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరుతుందని తెలిపారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి కేటీఆర్ చెప్పారని, త్వరలో ఇక్కడి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమవుతాయన్నారు. గాంధీ 151వ జయంతిని పురస్కరించుకుని కార్పొరేషన్ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సునీత, ఏసీపీ శివకుమార్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లో స్థానిక ప్రజలు, కార్పొరేటర్ ఏకే మురుగేశ్ సంయుక్తంగా సొంత నిధులతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ , డిప్యూటీ మేయర్ , టీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, బీసీ సెల్ అధ్యక్షుడు సోమయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు సిద్దులు యాదవ్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

వేములవాడ, అక్టోబర్ 3 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హాథ్రస్ జిల్లాలో హత్యాచారనికి గురై చనిపోయిన మనీషా వాల్మీకికి న్యాయం జరగాలని , ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి .అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి నివాళు లర్పించారు .అంబేద్కర్ సంఘం నాయకులు మాట్లాడుతూ దళితులపై దాడులు దేశంలో ఎక్కడో చోట ప్రతిరోజు జరుగుతూనే ఉన్నాయని వారు నూతన వ్యక్తం చేశారు .అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించేలా యూపీ ప్రభుత్వాన్ని కోరారు . మనీషా కుటుంబానికి న్యాయం జరగాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు

ఆపదలో టిఆర్‌కె ఆపన్న హస్తం

టి.ఆర్.కె ట్రస్ట్ సేవకులుగా మూడపల్లి గ్రామస్థులు

వేములవాడ, అక్టోబర్ 3 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పరిసర ప్రాంతాలకే కాకుండా టి ఆర్ కె ట్రస్టు సేవలను

నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ట్రస్ట్ సేవలు విస్తరిస్తున్నారు... టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్..ఇందులో భాగంగానేశనివారం చందుర్తి మండలం మూడపల్లి గ్రామం నుండి యువకులు టీ.ఆర్.కె ట్రస్ట్ లో స్వచ్ఛందంగా సేవ చేసేందుకు టి ఆర్ కె ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో చేరారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామాన టీ ఆర్ కె ట్రస్ట్ సేవలు విస్తరించాలనే ఉద్దేశంతో ట్రస్ట్ లో స్వచ్ఛందంగా సేవ చేసేందుకు వాలంటరీలుగా చేరుతున్నారన్నారు. ఆపదలో ఉన్న వారికి ట్రస్టు తరపున సహాయం చేసేందుకు ఎల్లప్పుడూ ముందు ఉంటామని తెలిపారు.

అనంతరం వారికి సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ కె ట్రస్ట్ వర్కింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

హత్రాస్ ఘటన బాధాకరం

ఈ నెల 5న చందుర్తిలో ధర్నా

వేములవాడ, అక్టోబర్ 3 (నేటినిజం ప్రతినిధి):ఉత్తరప్రదేశ్ లో హత్రాస్

ప్రాంతంలో 19 సంవత్సరాల యువతి పై అత్యాచార యత్నం చేసి, అతి కిరాతకంగా వ్యవహరించడంతో యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించగా, ఈ సంఘటన నిరసిస్తూ చందుర్తి మండల కేంద్రంలో దళిత సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు శనివారం చందుర్తి మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు, ఉత్తరప్రదేశ్ ఘటనను నిరసిస్తూ ఈనెల 5వ తేదీ సోమవారం మండల స్థాయిలో దళిత సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ అబ్రహం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దప్పుల అశోక్, నాయకులు బత్తుల కమలాకర్, దుమ్ము ఆనంద్, దేవ స్వామి, చంటి ప్రసాద్, నీరటి శ్రీనివాస్ తెలిపారు, సుమారు వెయ్యి మంది తో పెద్ద ఎత్తున ధర్నా చేపడుతున్నట్లు వారు తెలిపారు,

5నుంచి నట్టల నివారణ వారోత్సవాలు

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఆరోగ్య సమాజం ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 5 నుండి 12 వరకు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికి వచ్చి 1 నుంచి 19 సంవత్సరాలలోపు వయస్సు వారికి అల్బెండజోల్ మాత్రలు వేసేందుకు చర్యలు చేపట్టారు. నులి పురుగులు ఉన్న పిల్లలు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడతారు. నులిపురుగుల వల్ల పిల్లలకు అనేక అనర్థాలు కలుగుతాయి. ముఖ్యంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు వారిలో నులిపురుగులు ఉంటే వారిలో అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. నులి పురుగులనేవి పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు. వీటి ద్వారా శరీరంలో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయి.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.